www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 10 విజయవాడ 20-9-2012 పేజీలు : 8 వెల : రు 5.00

లోపలి పేజీల్లో...


- దక్షిణాఫ్రికా గని కార్మికుల ఊచకోత– నయాఉదారవాద ఆర్థిక విధాన అమానవీయ స్వభావానికో ఉదాహరణ
- అందరికీ ఉచిత మందులు–ఎండమావే!
- రైతుల సొమ్ముతో బీమా కంపెనీల వ్యాపారాన్ని పెంచుతున్న ప్రభుత్వం
- పోరాట పథాన్ని చేపట్టిన శ్రీలంక విశ్వవిద్యాలయాల అధ్యాపకులు
- బీళ్లుగా మారుతున్న తెనాలి డివిజన్ భూములు


## విద్యుత్ సంక్షోభ వ్యతిరేక ఆందోళనా మార్గంలో

## చిన్న పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు

**నానాటికీ** తీవ్రమౌతున్న విద్యుత్ సంక్షోభం కనుచూపుమేరలో పరిష్కారమౌతుందన్న ఆశలు ఆవిరవుతున్నాయి. ఈ సమస్యకారణంగా ఇప్పటికే రాష్ట్రంలోని 7 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో 11 వేల పరిశ్రమలు మూతపడి, వేలమంది కార్మికులు వీధులపాలయ్యారు. మరో 50 శాతం పరిశ్రమలు కేవలం విద్యుత్తు సమస్య కారణంగానే మూసివేత దిశలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాష్ట్రం మొత్తం విద్యుత్తు సరఫరాలో 12 శాతం చిన్నతరహా పారిశ్రామిక రంగానికి కేటాయించాల్సివుంది. ప్రస్తుతం 4.5 శాతము మాత్రమే కేటాయిస్తున్నారు. నెలకు 15 రోజులు మాత్రమే విద్యుత్తు సరఫరా చేస్తున్నప్పటికీ 80 శాతం నెలసరి వినియోగం బిల్లులు చెల్లించవల్సివస్తోంది. పెరుగుతున్న విద్యుత్ కోతలతో, అప్పులభారంతో మౌలాలి, జీడిమెట్ల ప్రాంతాలలో ఇద్దరు పారిశ్రామిక యజమానులు ఆత్మహత్యలు చేసుకొన్నారంటే, పరిస్థితి ఎంత తీవ్రరూపం దాల్చిందో అర్థంచేసుకోవచ్చు. రాష్ట్రంలోని పారిశ్రామిక కార్మికులలో 60 శాతం మందికిపైగా ఉపాధి కల్పిస్తూ; రాష్ట్ర, జాతీయాదాయాలలో 40 శాతం పైగా సమకూరుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకు 15 రోజులు కూడా ఖచ్చితంగా పనిచేయలేని పరిస్థితిలో; మిగిలిన రోజులలో ఎప్పుడు కరెంటువస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రభుత్వం పడవేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 1.14 లక్షల చిన్న కర్మాగారాలలో 40 శాతం పరిశ్రమలు ఇప్పటికే బిఐఎఫ్ఆర్ పరిధిలోకి వెళ్ళిపోయాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆ 40 శాతం 90 శాతం అయ్యే ప్రమాదం పొంచి వుంది.

### ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

2012 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ చిన్న పరిశ్రమల సమాఖ్య 'ఫాప్సియ' చేసిన ఆందోళనకు స్పందించి పరిశ్రమలశాఖ ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్కో ఛైర్మన్లు–ప్రభుత్వం 250 కోట్ల సబ్సిడీ అందించి, పునఃద్రవీకరించిన సహజవాయువును కొనుగోలుచేసి పరిశ్రమలకి అందించి, 250 మెగావాట్ల విద్యుత్ను అందించటం ద్వారా నేటి విద్యుత్ కొరత నుండి బయటపడవేస్తామని హామీనిచ్చారు. కానీ నేటికీ ఆ ప్రయత్నం చేయకపోగా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల జె.ఏ.సీతో చర్చలు జరిపేందుకు సైతం ముఖ్యమంత్రి సిద్ధపడలేదంటే, చిన్న పరిశ్రమల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పైగా, విద్యుత్ కొరతపై ముఖ్యమంత్రి వ్యాఖ్యానిస్తూ 'కిటికీలు తెరుచుకొని పడుకోమని' పరిహాసమాడుతున్న పరిస్థితి ఉంది. కానీ, దేశానికి అన్నంపెట్టే రైతుకు, దేశానికి సమస్త వస్తువులను సమకూర్చుతున్న–ముఖ్యంగా, చిన్న తరహా పరిశ్రమలకి విద్యుత్ సరఫరా చేసేందుకు మాత్రం సిద్ధపడటంలేదు.

### విద్యుత్ సంక్షోభానికి మూలం ఎక్కడ?

రాష్ట్రంలో 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డు' ఉన్నకాలంలో దేశంలోనే అగ్రగామిగా విద్యుదుత్పత్తి, పంపిణీలతో నిలచిన కాలం ఉంది. 80% స్థాపిత వినియోగ విద్యుత్తు పంపిణీ సాగించిన కాలం అది. అలాంటి విద్యుత్ బోర్డును ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లోబడి, కేంద్రంలోని నాటి కాంగ్రెసు, రాష్ట్రంలోని టి.డి.పి. ప్రభుత్వాలు 'ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ పథకాలకు' పూనుకొని, విద్యుత్ బోర్డును ముక్కలు చేసి, ట్రాన్స్కోను ఏర్పరచాయి. విద్యుదుత్పత్తిని ప్రైవేటుపరం చేస్తే నాణ్యమైన, చౌకైన విద్యుత్తు దొరుకుతుందని ప్రచారం చేసాయి. విద్యుదుత్పత్తి రంగంపై పట్టుసాధించిన రిలయన్స్, జిందాల్ వంటి బడా విద్యుత్తు పారిశ్రామిక సంస్థలు–చౌకధరకు బొగ్గును, సహజవాయువును కొల్లగొట్టి ఎక్కువ ధరకు విద్యుత్ను అమ్మి విద్యుత్ రేట్ల పెంపుదలకు కారణమౌతున్నాయని 'కాగ్' నివేదిక కూడా స్పష్టం చేసింది. కనుక, నేటి సంక్షోభాలకి బడా పెట్టుబడిదారుల లాభాపేక్ష, ప్రభుత్వ జోహుకుందారీ విధానాలే కారణం.

ఫలితంగా విద్యుత్ ఛార్జీలను యూనిట్ 9 రూ॥ నుంచి 12 రూ॥లకు పెంచటానికి; ప్రజలను, పారిశ్రామిక వేత్తలను అందుకు సిద్ధం చేయడానికే నేటి విద్యుత్ సంక్షోభాన్ని ట్రాన్స్కో, ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నాయి. మరోవైపున తీవ్రమైన విద్యుత్తు కొరతను చూపించి, ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్తు వైపుకు అందరి ఆలోచనలను మలిచే కుట్రపూరిత ప్రయత్నాలు సాగిస్తోంది. వేసవి కాలంలో జలవిద్యుత్తును ఎక్కువ ఉత్పత్తి చేసి అత్యధిక లాభాలు సంపాదించిన ట్రాన్స్కో, నేటి వర్షాభావ పరిస్థితులలో సైతం హోర్డింగ్లకు కరెంటు సరఫరా చేస్తూ, పరిశ్రమలకు, సేద్యానికి విద్యుత్తు సరఫరా చేయక చేతులు ఎత్తివేసింది. ప్రభుత్వం, 250 మెగావాట్ల విద్యుత్తును అందిస్తామనే హామీని అమలు జరపక నిర్లక్ష్యంగా ఉంది. దీనితో, తీసుకున్న వర్క్ఆర్డర్లు పూర్తిచేయలేక, పెరుగుతున్న వ్యాట్, పన్నుల భారాలు, టోల్గేట్ల బెడదలతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పోటీ ప్రపంచంలో నిలబడలేని పరిస్థితిని ప్రభుత్వమే ఉద్దేశ్యపూర్వకంగా కల్పిస్తోంది. పారిశ్రామిక వాడలలో కాప్టివ్ పవర్ జనరేషన్కి సైతం ప్రభుత్వం అనుమతించడంలేదు.

ఇలాంటి స్థితిలో ఫాప్సియా – చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల జాయింట్ కో ఆర్డినేషన్ కమిటి–మహిళా పారిశ్రామికవేత్తల సంఘం తదితర సంస్థలు విద్యుత్ సంక్షోభానికి వ్యతిరేకంగానూ, 'మా గ్యాస్ మా హక్కం'టూ సాగిస్తున్న ఆందోళనలనూ యావత్తు ప్రజానీకం బలపర్చవలసిందిగా కోరుతున్నాం. ఈ పరిశ్రమల యజమానులు; లక్షలాది కార్మికులు విద్యుత్ సంక్షోభానికి వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించాలని, రైతు – కూలీల అండదండలందుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

11-9-2012

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటి**
**సిపిఐ(ఎం.ఎల్)**

ప్రకటన

## ప్రజలపై భారాన్ని మోపే, దేశాన్ని సామ్రాజ్యవాదులకు అమ్మివేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**మన్మోహన్సింగ్** సారధ్యంలోని యుపిఏ–2 ప్రభుత్వం అనుసరిస్తున్న, ఒకదానిని మించి మరొకటిగా వున్న ప్రజావ్యతిరేక 'ఆర్థిక సంస్కరణ'లకు వ్యతిరేకంగా బలమైన నిరసనాందోళనలు జరపవలసిందిగా సిపిఐ(ఎం–ఎల్) ప్రజలకు పిలుపునిస్తున్నది. ప్రభుత్వం తన నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవలసిందిగా గట్టిగా డిమండ్ చేస్తున్నది.

'సంస్కరణల'ను వేగవంతం చేసే క్రమంలో 12 శాతం డీజిల్ ధరల పెంపుదల; వంట గ్యాసు సిలిండర్ల (ఎల్పిజి)కు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలో కోత వంటి చర్యలతో పాటుగా, పెరుగుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తుల వత్తిడికి తలొగ్గిన కాంగ్రెసు నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం–తన సంకీర్ణభాగస్వామ్య పార్టీల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో అత్యంత దూకుడుగా మనదేశ విమానయానం, విద్యుత్తు, ప్రసారమాధ్యమాలలోకి విదేశీ పెట్టుబడిని అనుమతించటం వంటి చర్యల అమలుకు పూనుకుంది. అదే విధంగా, మన్మోహన్సింగ్ ప్రభుత్వ మంత్రివర్గం ప్రభుత్వ ఖజానాకు లాభాలు సమకూరుస్తున్న ప్రభుత్వరంగ పరిశ్రమలలో 5 శాతం ప్రభుత్వ వాటాను అమ్మివేసేందుకు ముందుకొచ్చింది.

ఈ విధమైన చర్యలతో, కేంద్రంలోని మన్మోహన్సింగ్ ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తలుపులు బార్లా తెలవటంతో పాటు దేశంలోని సంపదల లూటీనీ, ప్రజలపై అధికమౌతున్న దోపిడీ క్రమాన్ని మరింతగా సరళతరం చేసింది.

దీర్ఘకాల ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్న అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రస్తుతం ముమ్మరంగా తమ దేశాధ్యక్ష ఎన్నికల క్రమంలోనున్న అమెరికాకు మరింత శక్తిని చేకూర్చే 'సమయోచిత' చర్యలుగా సోనియాగాంధీ సారధ్యంలోని కాంగ్రెసు పార్టీ అధినాయకత్వం, మన్మోహన్సింగ్ ప్రభుత్వం ఈ 'సంస్కరణా చర్యలు', ఒక వ్యూహంలో భాగంగా బాగా ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న నిర్ణయాలేననేది స్పష్టం.

ప్రధాని మన్మోహన్సింగ్ చెప్పుకుంటున్నట్లుగా 'జాతీయప్రయోజనాల' కోసం ఈ చర్యలు తీసుకోబడకపోగా, మీదు మిక్కిలి సామ్రాజ్యవాద పాలక వర్గ ప్రయోజనాలకు సేవ చేసేందుకే ఈ చర్యలు తీసుకోబడ్డాయనటంలో ఎలాంటి సందేహం లేదు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఏజన్సీలు, శక్తులు వాంఛిస్తున్న విధంగా భారత పాలకవర్గాలు–కేంద్రంలోని తమ పారంపర్య ప్రభుత్వాల ద్వారా తరవాతి దశ సంస్కరణలను ముందుకు తీసుకువెళ్ళేందుకు కట్టుబడివున్నామని, సామ్రాజ్యవాదశక్తులకు దేశాన్ని అమ్మివేసేందుకు తాము సదా సిద్ధంగావున్నామనే వాస్తవాన్ని సామ్రాజ్యవాద శిబిరానికి – ముఖ్యంగా అమెరికాకు ఒక స్పష్టమైన సందేశం అందజేయటంలో భాగమే ఈ 'సంస్కరణ చర్యల'న్నీ!

ఈ 'ఆర్థిక సంస్కరణలు' –సామాన్య ప్రజానీకపు కష్టాలు, బాధలను మరింత తీవ్రం చేస్తాయి; ఇప్పటికే రోజురోజుకీ అభద్రతతో జీవిస్తున్న వారి జీవనాన్ని ఇవి మరింత దుర్భరం చేస్తాయని ప్రత్యేకించి పేర్కొనాల్సిన అవసరం లేదు. సామాన్య ప్రజల మనుగడే పెద్ద ప్రశ్నార్థకం కానుంది.

మొత్తంగా పరిస్థితి సంక్లిష్టంగానూ, సంకటమైనదిగానూ వుంది. మన దేశాన్ని రక్షించుకోవటానికి ప్రజానుకూలశక్తుల తక్షణ జోక్యాన్ని ఈ పరిస్థితులు డిమాండ్ చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, సామ్రాజ్యవాద అనుకూల, దోపిడీ పాలక వర్గ అనుకూల మన్మోహన్సింగ్ ప్రభుత్వ మెడలు వంచి, ఈ 'ఆర్థిక సంస్కరణ చర్యల'ను వెనక్కుతీసుకునే వైపుగా లక్షలాది శ్రామిక ప్రజానీకం ముందుకువచ్చి బలమైన నిరసనోద్యమాన్ని నిర్మించవల్సిందిగా సిపిఐ(ఎం–ఎల్) పిలుపునిస్తున్నది.

15-9-12

**విశ్వం**
ప్రధానకార్యదర్శి
సిపిఐ (ఎం–ఎల్)

## కూడంకులం అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళనకారులపై పోలీసు కాల్పులను ఖండించండి!

**తమిళనాడు** రాష్ట్రం – కూండంకులం అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా పరిసర గ్రామాల ప్రజానీకం సంఘటితంగా, శాంతి యుతంగా, నిరంతరాయంగా 'అణువిద్యుత్తు వ్యతిరేక ప్రజాఉద్యమం' ఆధ్వర్యంలో తమ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

***అణువిద్యుదుత్పత్తికిగానూ రియాక్టర్లో యురేనియం నింపే ప్రయత్నాన్ని ఆపివేయాలని కోరుతూ ఆందోళన సాగిస్తున్న నిరాయుధులైన ప్రజానీకంపై 10-9-2012న పోలీసులు లాఠీఛార్జీ, భాష్పవాయు ప్రయోగాలతో పాటు తూత్తుకుడి జిల్లా మనవేడు గ్రామంలో కాల్పులు జరిపి ఆంథోని స్వామి (40) అనే మత్స్యకారుడిని బలిగొన్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం–కూడంకులం ప్రజలపై సాగిస్తున్న ఈ దమనకాండను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) తీవ్రంగా ఖండిస్తున్నది. పోలీసు కాల్పులలో మరణించిన ఆంథోని స్వామి (40) కి నివాళులర్పిస్తున్నది.***

ముఖ్యంగా –అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగివున్న జపాన్ దేశంలో గత సంవత్సరం సంభవించిన ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర విస్ఫోటన పరిణామాల అనంతరం – కూడంకులం ప్రాంత ప్రజలలో ఆందోళన మరింత తీవ్రమైంది.

అత్యంత ప్రమాదకరమైన కూడంకులం అణువిద్యుత్ కేంద్ర విస్తరణ నిర్మాణాన్ని నిలిపి వేయాలని, పూర్తయిన అణువిద్యుత్తు యూనిట్లలో విద్యుదుత్పాదన చేపట్టరాదని డిమాండ్ చేస్తూ పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను, అక్రమ కేసులను, గ్రామాల దిగ్బంధనం వంటి పలు ప్రభుత్వ వేధింపు చర్యలను ఎదుర్కొంటూ, ధిక్కరిస్తూ ప్రజలు ఆందోళనోద్యమాన్ని ముందుకు సాగిస్తున్నారు. అయినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి న్యాయమైన ఆందోళనను పెడచెవినబెట్టాయి.

(తరువాయి 2వ పేజీలో)

# భూమి సమస్యలపై సెమినార్

**భువనేశ్వర్, 10-8-12 :**

మనదేశంలోని విశాల గ్రామీణ ప్రజల జీవనాధారం భూమి. భారతదేశంలోని ఇతర ప్రాంతాల పాలకులవలెనే ఒడిషా పాలకులు కూడా కష్టజీవులైన రైతాంగ ప్రయోజనాలకనుగుణంగా ఈ సమస్యను పరిష్కరిస్తున్నామని పోజు పెడుతున్నారు. కానీ, ఈనాటికీ ప్రజల అనుభవం తీవ్ర నిరాశాజనకంగా వుంది. గత ఆరు దశాబ్దాలపైగా కాలంలో ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన విధానాల ఫలితంగా, మున్నెన్నటికంటే భూమి సమస్య మరింత తీవ్రమైందనీ, ఒడిషాలోని ఆదివాసులు, భూమిహీనులు, పేదరైతులు మరియు గ్రామీణ పేదలు తాము పరాయీకరింపబడినామనీ, మోసగింపబడినామనీ ఈనాడు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, నేటి భూమి సమస్య తీవ్రతను, దాని స్వభావాన్ని చర్చించి, దాని పరిష్కార మార్గాలను కనుగొనటం-ప్రజాతంత్ర శక్తుల, సంస్థల జరూరుకర్తవ్యంగా ముందుకొచ్చింది.

'ప్రపంచీకరణానంతర కాలంలో ఒడిషాలో భూమి సమస్య' అనే అంశంపై 2012 ఆగస్టు 10వ తేదీన భువనేశ్వర్‌లోని లోహియా అకాడమీలో ఛాసీమూలియా సంఘ్ ఆధ్వర్యంలో ఒక సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో ఒడిషాలోని వివిధ ప్రాంతాలనుండి 250 మందికిపైగా ప్రజానీకం, వివిధ ప్రజాఉద్యమాలకు చెందిన ప్రతినిధులు, ప్రజాతంత్రవాదులు పాల్గొన్నారు. డా॥ బి.డి. శర్మ ఈ సెమినార్‌లో ప్రధాన వక్తగా పాల్గొన్నారు.

**రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రజా ఉద్యమాలలో పోలీసు కాల్పులలో నేలకొరిగిన వారికి; ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజపూర్ జిల్లాలో ఎదురుకాల్పుల పేరిట సాగిన హత్యాకాండలో మరణించిన ఆదివాసులకు; శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేట గ్రామంలో కులదురహంకార కాపు పెత్తందార్ల దాడులలో హతులైన దళితులకు; మరియు 2010 అగస్టు 9న హత్యకు గురైన ఛాసీమూలియా ఆదివాసీ సంఘ నాయకులు కామ్రేడ్ కేంద్రుక అర్జున్‌లకు నివాళులర్పిస్తూ సెమినార్ ప్రారంభంలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు.**

ఒడిషా రాష్ట్ర ఛాషీమూలియా ఆదివాసీ సంఘ్ కార్యదర్శి కా॥ **శ్రీకాంత్** ఈ సెమినార్‌కు అధ్యక్షత వహించారు. ఒడిషా రాష్ట్రంలో గ్రామీణ పేద ప్రజానీకం ఎదుర్కొంటున్న భూమి సమస్య విస్తృతిని, స్వభావాన్ని విపులంగా వివరించారు.

**ఝూర్సుగూడ ప్రభుత్వ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గోలక్ బిహారీనాథ్,** గ్రామీణ ఒడిషాలో భూమిపై యాజమాన్యం తీరు గురించి దీర్ఘంగా వివరించారు. ఒడిషా ప్రభుత్వం రూపొందించి, అమలు చేసిన వివిధ భూ సంస్కరణ చట్టాలను, నిబంధనలను ఆయన వివరించి, అవన్నీ ఆర్భాట చర్యలుగా, ప్రజల కంటితుడుపు చర్యలుగా ఏ విధంగా కుదించబడిందీ పేర్కొన్నారు. ఫలితంగా విశాల గ్రామీణ పేదల భూమి సమస్య ఇప్పటికీ పరిష్కరింపబడవలసిందిగానే వుందనీ, ఈనాడు అత్యధిక భూములపై అదుపూ మరియు యాజమాన్యం భూమిపై శ్రమ చేయని భూస్వామ్య వర్గాల చేతుల్లోనూ, పలుకుబడి వర్గాలవారి చేతుల్లోనూ వుందనీ, కనుక అర్థభూస్వామ్య భూ సంబంధాలు రాష్ట్రంలో ప్రధానంగా వున్నాయనీ ఈ స్థితిలో, రైతాంగం- ప్రధానంగా భూమిహీనులైన నిరుపేదలు, కౌలు రైతాంగమూ - భూమి సమస్య పరిష్కారానికి పోరాట మార్గాన్ని చేపట్టాలని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

**ఉత్కళ్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర మాజీ ప్రొఫెసర్, డా॥ బీరేంద్ర నాయక్** మాట్లాడుతూ ప్రపంచీకరణ అనంతర పరిస్థితులలో కొద్దిమంది కార్పోరేట్ల, అత్యధిక సంపన్నుల చేతుల్లో భూమి కేంద్రీకరింపబడుతున్న తీరు పెరుగుతుండటాన్నీ, దీనికి సంపూర్ణంగా సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో భూ సంస్కరణల క్రమం పూర్తిగా తిరోగమించిన దుష్ఫలితాలనీ ఆయన వివరించారు. అదేవిధంగా సెజ్‌లు, భూసేకరణ చట్టాల వంటి ద్వారా బహుళజాతి, బడా పెట్టుబడిదారీ వర్గాలు విశాలభూఖండాలను ఆక్రమించుకుంటున్నాయనీ, ఆ విధంగా భారత భూభాగంలో అనేక 'విదేశీ భూభాగాలను' సృష్టిస్తున్నాయనీ ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ జాతీయ వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

ప్రధాన వక్తగా ప్రసంగించిన **ఎస్‌సి, ఎస్‌టీ కమీషన్ మాజీ ఛైర్మన్, భారత జన ఆందోళన్ నాయకులు డా॥ బి.డి. శర్మ,** ఆనాటి వలస పాలకుల నుండి, 1947 తర్వాతి కాలంలో స్వతంత్ర ప్రభువులుగా చెప్పుకునే వారి వరకూ ఆదివాసులను వారి భూమి, అడవి, నీటివనరులపై, వారి సహజవనరులపై హక్కుల నుండి దూరం చేసి ఆ భూములను ఏ విధంగా కబ్జాచేస్తున్నారో వివరించారు. ఈనాడు, తమ హక్కులను, భూములను కోల్పోయిన ఈ ఆదివాసులు ప్రభుత్వ సహాయం, దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధంగా నెట్టబడ్డారన్నారు. దశాబ్దాల కాలంగా ఆదివాసుల హక్కులపై కొనసాగుతున్న రాజ్యం దురాక్రమణ, జోక్యాలనేవి- ఆదివాసీ సమూహాల స్వావలంబన ఆర్థికాన్ని, వారి రాజకీయ, సాంస్కృతిక, న్యాయపరమైన స్వతంత్ర వ్యవస్థనూ ధ్వంసం చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుచేసే వివిధ చర్యలు, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు సారాంశాన్ని, 'పీసా' చట్టాన్ని నిరుపయోగం చేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఆదివాసీ ప్రజానీకం, వారి వనరులపై హక్కును, వారి స్వయంపాలన హక్కులను తిరిగి సాధించుకునేందుకు పోరాటం సాగించాలని డా॥ బి. డి. శర్మ పేర్కొన్నారు.

**ఏఐకెఎమ్‌కెఎస్ కో కన్వీనర్ కామ్రేడ్ ఎస్.ఝాన్సి** మాట్లాడుతూ, ఒడిషాలోని ఆదివాసీ ప్రాంతాలన్నింటా, ఆదివాసీ ప్రజల భూబదలాయింపు నిరోధ చట్టాలన్నింటినీ తుంగలో తొక్కుతూ ఆదివాసీయేతర సంపన్నవర్గాలు లక్షలాది ఎకరాల ఆదివాసుల భూములను కబ్జా సాగిస్తున్నాయని వివరించారు. గత 15 సంవత్సరాలపైగా కోరాపుట్‌జిల్లా ఆదివాసీ ప్రజానీకం ఛాషీమూలియా ఆదివాసీసంఘం ఆధ్వర్యంలో పరాయీకరింపబడిన తమ భూముల పునఃస్వాధీనానికి పోరాటం సాగిస్తున్నారని, వెయ్యి ఎకరాలకు పైగా భూములను ఆవిధంగా తిరిగి నిలబెట్టుకోగలిగారని పేర్కొన్నారు. ఈ భూమిపై ఆదివాసీ ప్రజల న్యాయమైన హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఏవిధమైన చర్యా తీసుకోలేదనీ, ఛాషీమూలియా ఆదివాసీసంఘం దృష్టికి తీసుకువచ్చే సమస్యలన్నింటి పట్ల ప్రభుత్వం మొండివైఖరితో వ్యవహరించిందని చెప్పారు. ఛాషీమూలియా ఆదివాసీ సంఘం నాయకత్వంలో సాగుతున్న ఆదివాసుల పోరాటం- భూమిసమస్య పరిష్కారంకోసం దోపిడీ ప్రభుత్వ విధానాలకు, దోపిడీవర్గాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టి సాగుతోందన్నారు. ఆదివాసులు తమ భూమిపై, వనరులపై, అడవిపై న్యాయమైన హక్కుకోసం సంఘటిత, ఐక్యఉద్యమాలు సాగించాల్సివుందనీ, ఈ కర్తవ్యాల సాధనకై పూనిక వహించాలనీ కా॥ ఝాన్సీ పిలుపునిచ్చారు.

**ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥గణేష్‌పండా, కా॥ బ్రహ్మానందమల్లిక్, ప్రఫుల్లసమంతరా,** మరియు **కా॥ కృష్ణ** ఈ సెమినార్‌లో పాల్గొని ప్రసంగించారు. **కా॥ బాలకృష్ణ** పూరీ జిల్లాలోని సిపాసరుబాలీలో భూమికోసం సాగుతున్న ప్రజాఆందోళనను వివరిస్తూ, వారి న్యాయమైన ప్రజాస్వామిక పోరాటానికి మద్దతునీయవలసిందిగా విజ్ఞప్తిచేశారు.,

ముగింపులో సెమినార్ మూడు తీర్మానాలను ఆమోదించింది. అవి : 1. కోరాపుట్ జిల్లాతోసహా ఒడిషాలోని వివిధ ప్రాంతాలలో ప్రభుత్వం ఆదివాసీ, పేద ప్రజానీకం ఆక్రమించుకున్న భూములపై చట్టబద్ధ హక్కులు కల్పించాలి. 2. పూరీజిల్లాలోని సిపాసరుబాలిలో 'సముఖబీచ్ ప్రాజెక్టు' అనబడే ప్రత్యేక పర్యాటక ప్రాజెక్టును రద్దుచేయాలి. ఈ ప్రాంతంలోని పేద ప్రజానీకానికి ఆ భూమి మరియు అటవీ ప్రాంతంపై చట్టబద్ధహక్కులు కల్పించాలి. 3. విస్థాపన వ్యతిరేక ఉద్యమంలోనూ, భూమికోసం సాగే ఉద్యమాలలోనూ ప్రజలు, కార్యకర్తలపై బనాయించిన తప్పుడు కేసులన్నీ ఎత్తివేయాలి. ఇప్పటికీ జైలు నిర్బంధాలననుభవిస్తున్న వారందరినీ వెంటనే విడుదల చేయాలి.

ఛాషీమూలియా ఆదివాసీసంఘం సాంస్కృతిక విభాగ ఆధ్వర్యంలో కామ్రేడ్స్ బసు, కృష్ణల బృందం తమ ప్రజాసాంస్కృతిక కళారూపాలతో ఆకట్టుకుంది. కా॥సుశాంత్ కృతజ్ఞతలు తెలియజేయటంతో కార్యక్రమం ముగిసింది. ✡

# పోరాట పథాన్ని చేపట్టిన శ్రీలంక విశ్వవిద్యాలయాల అధ్యాపకులు

**ప్రజల**న్యాయమైన పోరాటాలను అణచివేసేందుకు "నాజూకైన" (ప్రక్కదారిపట్టించే, చీల్చివేసే); "కఠినమైన" (నిర్బంధం) పద్ధతులను అనుసరించటం దోపిడీవర్గ పాలకుల చేతుల్లోని ఆయుధాలుగా వున్నాయి. శ్రీలంక పాలకులు ప్రజలపై ఈ పద్ధతులనే వినియోగిస్తున్నారు. 1980లలో తిరగబడ్డ సింహళ ప్రజలను పాశవిక నిర్బంధంతో అణచివేశారు. ఈ తిరుగుబాటు మొత్తం దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా విప్లవంగా మారగల "ప్రమాదాన్ని" నివారించేందుకు ప్రజలను చీల్చివేసి వారి మధ్య ఐక్యత ఏర్పడని పద్ధతులను అమలు జరిపారు. తర్వాతి దశలో తమిళ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు వ్యతిరేకంగా సింహళీయులలో జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టారు. శ్రీలంక తమిళ ప్రజలపై దశాబ్దకాలంపాటు శ్రీలంక పాలకులు సాగించిన యుద్ధం వాస్తవానికి రెండు అంచులకత్తి. ఇది-శ్రీలంకలో ఒక జాతి ప్రజలను అణచివేసే అంచుగల కత్తి; అదే సమయంలో శ్రీలంక ప్రజలను జాతులుగా చీల్చి, మౌలిక ప్రజాస్వామిక డిమాండ్ల నుండి వారిని ప్రక్కకు మళ్లించే ఆయుధం కూడా! ఈ ముసుగులో శ్రీలంక పాలకులు మొత్తంగా శ్రీలంక ప్రజలను అణచివేసే నిరంకుశాధికారాలను పొందారు.

సామ్రాజ్యవాదులు రుద్దిన నయాఉదారవాద విధాన ఫలితంగా ప్రజలపైన, ప్రత్యేకించి కార్మికవర్గంపైనా దోపిడీ, అణచివేతలు పెరిగాయి. సామాజిక సంక్షేమం, విద్య, వైద్యరంగాలలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి వేసి ప్రైవేటు మార్కెటుశక్తుల పరం గావించటం తదితర చర్యలతో ధరలు పెరిగిపోయాయి. తమిళ ప్రజలపై సాగించిన యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. తమిళులపై యుద్ధం ముగిసిందని ప్రకటించేనాటికి శ్రీలంక ఆర్థిక-రాజకీయ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది.

యుద్ధానంతర పరిస్థితిలో ప్రజలకు ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించటంలోనూ, కనీస స్థాయిలోనన్నా ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించటంలోనూ కనీస శ్రద్ధను కూడా చూపలేదు. ప్రజారాశులపై రాజ్యం సాగిస్తున్న నిరంకుశ చర్యలను మరింత బలీయం చేసేందుకే పూనుకున్నారు. వివిధ స్వతంత్ర కమీషన్లను బలహీనపరుస్తూ, దౌత్య, పరిపాలన, విశ్వవిద్యాలయాలల్లో తమ విశ్వాస పాత్రులనే నియమించుకోగలిగే విధంగా అధ్యక్షుడికి అధికారాలు సంక్రమింపజేసే 18వ రాజ్యాంగ సవరణను తెచ్చారు. నయాఉదారవాదవిధానాల రెండవ విడతను ప్రారంభించారు. సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి పెత్తనానికి అనువుగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పెట్టుబడి స్థానాన్ని పెంచారు. నిరంకుశ పాలన, నయాఉదారవాద విధానాల అమలు జమిలిగా శ్రీలంకలో సాగించేందుకు పూనుకున్నారు.

దీనితో సహజంగా అనేక వర్గాల ప్రజల పోరాటాలు గత రెండేళ్లుగా శ్రీలంకలో పెల్లుబికాయి. సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులూ సాగిస్తున్న నిలకడైన పోరాటాలకు విశ్వవిద్యాలయాలు కేంద్రమయ్యాయి. విద్యారంగానికి నిధులకోత, ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు విద్యారంగ ప్రైవేటీకరణ; అసంతృప్తి, నిరసనలకు తక్షణ కారణాలుగా వున్నాయి. దీనికి అధ్యాపకుల, బోధనేతర సిబ్బంది వేతనాలు స్తంభింపచేయటమూ, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై నిర్బంధమూ, విశ్వవిద్యాలయాల్లో చేరేవారికి నిర్బంధ సైనిక శిక్షణ ప్రవేశపెట్టడమూ, తమ విశ్వసనీయులనే ఉన్నతాధికారులుగా నియమించటమూ, నిధులు తగ్గించి విశ్వవిద్యాలయాలను ప్రైవేటీకరించటమూ తోడయ్యాయి. నిరసనలు తీవ్రమయ్యాయి. విద్యార్థుల, అధ్యాపకుల కోర్కెలను పట్టించుకోలేదు. అంతేకాక, విద్యార్థులను, అధ్యాపకులనూ, పత్రికా విలేఖరులను బెదిరించి లొంగదీయ ప్రయత్నించింది. విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడయిన డా॥ నిర్మల్ రంజిత్ దేవిసిరిని హత్యచేసింది. అయినా అధ్యాపకులు దృఢంగానిలిచారు. సమాఖ్య దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చింది. సమ్మెకుసన్నాహంలో భాగంగా, సంతకాల సేకరణ, బహిరంగ సభలు, మద్దతు కోరుతూ విజ్ఞప్తులు తదితర కార్యక్రమాలను సాగిస్తున్నారు. 2012 జూలై 4న అన్ని విశ్వవిద్యాలయాలూ సమ్మెలో పాల్గొన్నాయి.

అధ్యాపకుల సమాఖ్య డిమాండ్లు, వేతనాలపెంపుకే పరిమితం కాలేదు. విద్యారంగాన్ని ప్రైవేటీకరించే, రాజకీయ మయం చేసే, సైనికీకరించే ప్రభుత్వ విధానాలను వారు ప్రశ్నించారు. విద్యారంగంపై ప్రభుత్వ వ్యయాన్ని 1.6 శాతం నుండి 6 శాతానికి పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయాలను ప్రజాస్వామీకరించాలని కోరారు. అణచివేత చర్యలను ఖండించారు. కార్మికులు, ఇతర శ్రామిక వర్గాలు పోరాట పథాన్ని చేపట్టేవైపుగా తగిన స్ఫూర్తిని ఈ పోరాటం ఇస్తుందని శ్రీలంక ప్రజాస్వామిక శక్తులు ఆశిస్తున్నాయి. అది భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంగా శ్రీలంకలో బలపడాలని అవి కోరుకుంటున్నాయి. ✡

**కూడంకులం...** (మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలిత యొక్క పాలకవర్గ అవకాశవాద కుటిల రాజకీయ విధానాలను; కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం అబ్దుల్ కలామ్‌లాంటి వారి ద్వారా వంచనాత్మకంగా నెరిపిన మధ్యవర్తిత్వ ప్రయత్నాలను; కూడంకులం ప్రాంత ప్రజల ఆందోళనల వెనుక 'విదేశీ హస్త' ముందనే ప్రధాని కుట్రపూరిత ప్రకటనలను కూడంకులం ప్రాంత ప్రజానీకం సమర్థవంతంగా తిప్పికొట్టారు. విస్తృత సంఘీభావాన్ని కూడగట్టారు.

కూడంకులం అణువిద్యుత్ కేంద్రంలోని రియాక్టర్లలో యురేనియం నింపబోతున్నారనే సమాచారాన్నందుకొని 9వ తేదీ (ఆదివారం) నుండే వేలాదిమంది ప్రజానీకం అణువిద్యుత్తు కేంద్రాన్ని చుట్టుముట్టి, రాత్రంతా కదలకుండా అక్కడే బైఠాయించి నిరవధిక ఆందోళన చేపట్టారు. నిరసనకారులతో కలెక్టర్-ఇతర పోలీసు ఉన్నతాధికారులు చర్చలు జరిపి, వారిని వెనక్కు పంపించేందుకు చేసిన ప్రయత్నాలను వారు సాగనివ్వలేదు.

సోమవారం (10-9-12న) ఆందోళనకారులను అడ్డుతొలగించేందుకు పోలీసులు ఏకపక్షంగా లాఠీఛార్జీ చేసి, భాష్పవాయువు ప్రయోగించారు. కోపోద్రిక్తులైన ప్రజలు పోలీసుల కళ్ళల్లో ఇసుక పోశారు. తమచేతికందిన కర్రలు, చెప్పులు పోలీసులపై విసిరికొట్టారు.

పోలీసుల దాడులతో తీరప్రాంత మత్స్యకార గ్రామాలు అట్టుడికి పోయాయి. ఎక్కడికక్కడ ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ గ్రామాలలోకి పోలీసు వాహనాలను రానీయకుండా రోడ్లను తవ్వివేసి, గండ్లు కొట్టారు. చెట్లు, సిమెంటు దిమ్మెలను అడ్డువేశారు. అనేక గ్రామాల్లోకి జొరబడటానికి పోలీసులు చేసిన ప్రయత్నాలను శివార్లలోనే ప్రజలు ఎదుర్కొన్నారు. ప్రజావ్యతిరేకత ఎంతటి స్థాయిలో ఉందో ఇప్పటికైనా గమనించి, అణువిద్యుదుత్పాదన ప్రక్రియను వెనక్కి తీసుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు-విదేశీ సామ్రాజ్యవాద, బడాపారిశ్రామిక వర్గ ప్రయోజనాలకే కంకణం కట్టుకోని, ప్రజలపై కాల్పులకు తెగబడ్డాయి. తూత్తుకుడి జిల్లా -మనవేడు గ్రామ శివార్లలో పోలీసులు జరిపిన కాల్పులలో ఆంథోని స్వామి అనే మత్స్యకారుడు మరణించాడు. మొత్తంగా పోలీసుల లాఠీచార్జీ, భాష్పవాయు ప్రయోగం, కాల్పుల సంఘటనల్లో మహిళలు, వృద్ధులతో సహా వందలాది ప్రజలు గాయపడ్డారు. అయినా, ప్రజల ఆందోళన కొనసాగుతోంది.

ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్ర విపరిణామాల అనంతరం జపాన్‌లో వ్యక్తమైన ప్రజా నిరసనల ఫలితంగా, ఆ దేశంలోని అణువిద్యుత్ కర్మాగారాలన్నింటినీ ప్రభుత్వం మూతవేసింది. ఇప్పటికే అణువిద్యుదుత్పాదన సాగిస్తున్న ప్రపంచంలోని పలు దేశాలుకూడా ఆయా దేశాల ప్రజాభీష్టానికి తలొగ్గి వాటిని మూసివేసేస్తుండగా, కాలం చెల్లిన ఆయా దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని నిస్సిగ్గుగా తలకెత్తుకోని మన దేశప్రజలను దుస్సహ పరిణామాలలోకి పడదోయటానికి మన పాలకులు పరుగులు పెడ్తుండటం క్షంతవ్యం కాదు.

***మనదేశానికి మూడువైపులానున్న తీరప్రాంతాన్ని అణువిద్యుత్ కర్మాగారాల పేరిట సామ్రాజ్యవాదుల కబంధహస్తాలకప్పగించివేస్తూ; మనదేశ ప్రజానీకాన్ని తరతరాలుగా తరగని తీవ్రమైన పర్యావరణ, హానికర, కాలుష్యలకు గురిచేస్తూ; విస్థాపనకు గురిచేస్తూ; విదేశీ బహుళజాతి బడాపరిశ్రమల విద్యుత్తు అవసరాలకోసం నిర్మిస్తున్న అత్యంత ప్రమాదకరమైన అణువిద్యుత్తు కేంద్రాలను; యురేనియం తవ్వకాలను, యురేనియం శుద్ధి కర్మాగారాలను వెంటనే నిలిపివేయవలసిందిగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తున్నది.***

మన రాష్ట్రంలో -కాంగ్రెసు ప్రభుత్వ పాలనలో శ్రీకాకుళం జిల్లా సోంపేట, కాకరాపల్లిలలో థర్మల్ విద్యుత్తు కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా పంట భూములను కబళించివేస్తూ, ప్రజలను పెద్ద ఎత్తున విస్థాపనకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన సాగిస్తున్న వారిపై పోలీసులు కాల్పులు జరిపి రైతులను, మత్స్యకారులను బలిగొన్నారు-విజయనగరం జిల్లా కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని నిరసిస్తున్న వారిపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. అదే విధంగా మనరాష్ట్రంలోనే- శ్రీకాకుళంజిల్లా-రణస్థలం వద్ద ప్రభుత్వం వేగిరపరుస్తున్న అణువిద్యుత్ కేంద్ర స్థాపన ప్రయత్నాలను సమైక్యంగా అడ్డుకోవటానికి ప్రజలు ఆందోళనమార్గంలో వున్నారు.

***మనరాష్ట్రంలో 'రణస్థలం' అణువిద్యుత్ కర్మాగార వ్యతిరేక ఆందోళనను సమైక్యంగా ముందుకు కొనసాగించవలసిందిగా ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజాసంస్థలు, మేధావులకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) విజ్ఞప్తి చేస్తున్నది. కూడంకులం అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఉద్యమానికి సంఘీభావం తెలపవలసిందిగా పిలుపునిస్తున్నది.***

**ఎస్. ఝాన్సి**
**అధ్యక్షులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**

**విజయవాడ**
**11-9-12**

# దక్షిణాఫ్రికా గని కార్మికుల ఊచకోత

## నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమానవీయ స్వభావానికో ఉదాహరణ



**దక్షిణాఫ్రికాలోని** మారికానా ప్లాటినం గనులలో సమ్మెచేస్తున్న కార్మికులపై ఆగస్టు 16న పోలీసులు కాల్పులు జరిపి 34 మందిని అక్కడికక్కడే బలిగొన్నారు; దాదాపు 80 మంది కార్మికులను తీవ్రంగా గాయపరిచారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ప్లాటినం ఉత్పత్తిదారుగావున్న, లండన్‌కు చెందిన గనుల పరిశ్రమదిగ్గజం 'లాన్‌మిన్' కంపెనీ మారికానా గనుల యజమానిగా వుంది. గని కార్మికులు, తమలో విభేదాల కారణంగా, అంతులేని ఆగ్రహంతో అదుపుతప్పి కొట్లాడుకుంటుంటే, ఆ పరిస్థితిని అదుపుజేసేందుకు ప్రయత్నించిన సందర్భంలో పోలీసులు కాల్పులు సాగించవలసివచ్చిందని, దక్షిణాఫ్రికా అధినేతలు, కార్పొరేటు మీడియా వర్గాలు–గనికార్మికులపై పోలీసులు సాగించిన హత్యాకాండను సమర్థించబూనుకున్నారు. మారణాయుధాలను కలిగివున్న గని కార్మికులు తమలోతాము కొట్లాడుకోవటంతోపాటు, పోలీసులతోనూ ఘర్షణకు దిగారనీ, ఈ పరిస్థితిని అదుపు జేసేందుకు సాయుధపోలీసులు కాల్పులు జరపవలసిన అనివార్య పరిస్థితులను గని కార్మికులే కల్పించారనే కథలను సృష్టించి, ప్రచారంలో పెట్టటం ద్వారా గని కార్మికులను ఊచకోత గావించిన పోలీసుల క్రూరత్వాన్ని మరుగుపరచజూస్తున్నారు.

గని కార్మికులపై సాగించిన ఈ నరమేధ సంఘటన–'జాతివివక్ష' అంతమైందంటున్న గత 18 సంవత్సరాలలోకెల్లా పోలీసుల అత్యంత క్రూరమైన చర్యగా నమోదైంది. దక్షిణాఫ్రికా ప్రజానీకం ఘోరమైన ఈ హత్యాకాండవార్త విన్న వెంటనే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ క్రూర సంఘటనను తీవ్రంగా నిరసించారు. జాతి వివక్ష పాలకుల పాలననాటికంటే 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్' పాలనలో దక్షిణాఫ్రికా నల్లజాతీయుల బతుకులు మరింత ఘోరంగా తయారయ్యాయనే అంశాన్ని, ఈ చర్య వెల్లడి చేస్తోంది.

పాలకులూ, కార్పొరేటు మాధ్యమాలూ ప్రచారం చేసిన విధంగా, గని కార్మికులపై జరిగిన ఈ హత్యాకాండ ఘటన, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అప్పటికప్పుడు చోటుచేసుకున్నదెంతమాత్రమూ కాదు. తద్భిన్నంగా, తన పెట్టుబడిదారీ విధాన మూలాల్లోనే అంతర్గర్భితమైన అనివార్య, ఆర్థిక సంక్షోభ దుర్లక్షణాలతో జబ్బున పడిన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ–దక్షిణాఫ్రికాపై–ముఖ్యంగా గనులరంగంపై మోపిన ఆర్థిక సంక్షోభ భారాల ఒకానొక దుష్ఫలితమే ఈ గని కార్మికుల ఊచకోత ఘటన! దక్షిణాఫ్రికాలో పేద–ధనిక వర్గాల మధ్య ఆర్థిక అసమానతలు మరింతగా పెరిగిపోతున్న దాని దుష్ఫలితమే ఈ ఘటన. పేదరికం, అసమానత్వం, నిరుద్యోగం–అనే ఈ మూడు అంశాలు, ఈ క్రూరహత్యా సంఘటనకు దోవతీసిన కారణాలుగా వున్నాయి.

ప్లాటినం తదితర విలువైన లోహ ఉత్పత్తుల ఫలితంగా యజమానులకు ఒకవైపున పెద్దఎత్తున సంపదలు పోగుపడుతూంటే, నికృష్టపనిపరిస్థితుల్లో తమ ప్రాణాలనే పణంగా పెట్టి, ఆ లోహాలను వెలికి తీస్తున్న గని కార్మికులు మాత్రం, రోజురోజుకీ కడుపేదలుగా నికృష్ట జీవన పరిస్థితుల్లోకి దిగజార్చబడుతున్నారు. మారికానా ప్లాటినం గనులలో పనిచేసే కార్మికులలో ఎక్కువమంది మొజాంబిక్, స్వాజీలాండ్ తదితర దేశాలకు చెందిన నిరుపేదలు. వీరంతా తాగునీరు, విద్యుత్తు వంటి కనీస అవసరాలు కూడా లేని ఖైదుకొట్లకంటే హీనమైన గదులలో నివసిస్తూ, అత్యంత తక్కువ వేతనాలు పొందేవారుగా వున్నారు.

గని కార్మికుల ఈ దుర్భర దారుణ జీవన, పని పరిస్థితులే వారిని అనివార్యంగా ఈ పరిస్థితులను మార్చుకునే పోరాటమార్గం వైపు నెట్టాయి. రోజువారీగా పెరుగుతున్న నిత్యజీవితావసర వస్తువుల ధరల కనుగుణంగా తమ వేతనాలను పెంచాలని గని కార్మికులు గత 10 నెలలుగా యజమానులను డిమాండ్ చేస్తూవస్తున్నారు.

గని కార్మికుల తీవ్ర దయనీయ పరిస్థితి ఇదికాగా, అధికారంలోనున్న 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసు' అనుబంధ కార్మిక సంఘమైన 'నేషనల్ యూనియన్ ఆఫ్ మైనర్స్' (ఎన్‌యుఎమ్) నాయకత్వం –గని కార్మికుల కష్టాలను, సమస్యలను పెడచెవిన పెట్టింది. అంతేగాక, వారిని అమానవీయ దోపిడీకి గురిచేస్తున్న గనుల యాజమాన్య కంపెనీలతోను, వారికి దన్నుగా నిలుస్తున్న ఏఎన్‌సి ప్రభుత్వంతోనూ అంటకాగుతూ, ఆ అధికార వేడుకలలో మునిగి తేలుతున్నది. వాస్తవానికి ఎన్‌యుఎమ్ యొక్క నిరంకుశ నాయకత్వం అట్టడుగుస్థాయి కార్మికులతో పూర్తిగా విడివడిపోయివుంది. అది–పాలక ప్రభుత్వం, గని యాజమాన్యాలు అనుమతించిన మేరకు 'వైట్‌కాలర్' ఉద్యోగస్థుల ప్రయోజనాలు నెరవేర్చటానికే పరిమితమైంది.

ఎన్‌యుఎమ్‌కు గతంలో అధ్యక్షునిగా పనిచేసిన 'కార్మికనాయకు'డొకరు, ప్రస్తుత కార్మికుల హత్యాకాండ జరిగిన గనియాజమాని అయిన లాన్‌మిన్ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకానొక సభ్యుడిగా వున్నాడు. ఎన్‌యుఎమ్ ప్రస్తుత కార్యదర్శిగావున్న ఫ్రాన్స్‌బలేని, దక్షిణాఫ్రికా గనుల జాతీయకరణను, మరే వ్యాపారవేత్త కంటే కూడా ఎక్కువగా వ్యతిరేకిస్తున్నవాడుగా వున్నాడు. ఇప్పటికే అధికవేతనాలు అందుకొంటున్న 'విశ్వాస పాత్రుడైన' ఈ కార్యదర్శి బలేనీకి, యాజమాన్యం 40 శాతం వేతనాన్ని పెంపు చేసింది. కానీ అదే సమయంలో, గని కార్మికుల వేతనాలను కనీసంగా పెంచటానికి యాజమాన్యం నిరాకరించింది. ఈ విధంగా, గని కార్మికుల తరఫున నిలబడి యాజమాన్యంతో వేతనాల పెంపుదలపై బేరసారాలాడవలసిన ఎన్‌యుఎమ్ నాయకత్వం యాజమాన్యంతో కుమ్ముక్కైంది. ఫలితంగా, గని కార్మికులలో ఎన్‌యుఎమ్ తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయింది. వాస్తవానికి, ప్రపంచవ్యాపితంగా, గుర్తింపు పొంది, పాదుకుపోయిన, సాంప్రదాయక కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాల వ్యవహారాలన్నీ, తమ సంఘ సభ్యులైన కార్మికుల ప్రయోజనాలకు హానికల్గించే విధంగానే వుంటున్నాయి. నయాఉదారవాద ఆర్థిక విధానాలను అమలుచేసే ప్రభుత్వాలన్నీ, ఈలాంటి 'కార్మిక యూనియన్'ల నాయకత్వాలకే మద్దతునిచ్చి, ప్రోత్సహిస్తున్నాయి.

కావున, ఈలాంటి పరిస్థితులే లాన్‌మిన్ ప్లాటినం గని కార్మికులు ఎన్‌యుఎమ్‌తో విడగొట్టుకొని అనివార్యంగా 'ఏఎమ్‌సియు' అనే ఒక స్వతంత్ర యూనియన్‌ను ఏర్పరుచుకునేందుకు దోవతీశాయి. చాలా సహజంగానే, దక్షిణాఫ్రికా ఏఎన్‌సి ప్రభుత్వంగానీ, గని యజమానులు గానీ గని కార్మికుల చట్టబద్ధ ప్రతినిధిగా ఈ యూనియన్‌ను గుర్తించలేదు.

ఏమైనా, ఏఎమ్‌సియు నాయకత్వం అత్యంత నిరుపేదలైన గని కార్మికులను వారి దుర్భరమురికివాడల నుండే సంఘటితపరిచింది. గని కార్మికుల నివాసం, విద్య, వైద్యం వంటి సమస్యలన్నింటి పరిష్కారానికై, ఏఎమ్‌సియు నాయకత్వంలో గని కార్మికులు, వారి కుటుంబాలతో కలసి మిలిటెంట్ నిరసనాందోళనలు నిర్వహిస్తూవచ్చారు.

ఈ నేపథ్యంలో, భూగర్భంలో గనులను తొలిచే ప్రమాదకరమైన, కష్టతరమైన విభాగంలో పనిచేసే కార్మికులు, తమకు అతి తక్కువగా చెల్లిస్తున్న నెలకు 4000 ర్యాండ్ల వేతనాన్ని 12 వేల ర్యాండ్లకు పెంపు చేయాలని ఏఎమ్‌సియు నాయకత్వాన డిమాండ్ చేశారు. ఆగస్టు 10వ తేదీ నుండి లాన్‌మిన్ యాజమాన్యంలోని మారికానా ప్లాటినమ్ గనిలోని మొత్తం 28 వేల మంది కార్మికులలో గనులు తొలిచే 3000 మంది కార్మికులు సమ్మె ప్రారంభించారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోవటానికి లాన్‌మిన్ గనుల యాజమాన్యం నిరాకరిస్తూన్న పరిస్థితుల్లో, గుర్తింపబడిన అధికార యూనియన్ అయిన ఎన్‌యుఎమ్ నాయకత్వం, సమ్మె కట్టిన గని కార్మికులకు మద్దతునీయటానికి బదులుగా కార్మికుల డిమాండ్ అవాస్తవికంగా వుందంటూ యాజమాన్యంతో గొంతు కలిపింది.

మరోవైపున, గుర్తింపుపొందిన యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహింపబడటంలేదు కనుక, ఈ సమ్మె చట్టవిరుద్ధమైనదని యాజమాన్యం ప్రకటించింది. గుర్తింపు పొందిన ఎన్‌యుఎమ్ నాయకత్వం, సమ్మె చేస్తున్న కార్మికులమధ్య చీలికలు కల్పించే, పోటీ కార్మికులను ప్రవేశపెట్టి సమ్మెను విచ్ఛిన్నంచేసే కుటిల ఎత్తుగడలకు పాల్పడింది. ఐనప్పటికీ, తమ సమ్మెను విచ్ఛిన్నంచేసే ప్రయత్నాలను కార్మికులు సమైక్యంగా తిప్పికొట్టారు. ఈ క్రమంలో, ఎన్‌యుఎమ్ నాయకత్వపు మద్దతుదారులైన పోటీ కార్మికులతో సమ్మెచేస్తున్న కార్మికులు సంఘర్షణ పడకతప్పలేదు. యథాప్రకారం పోలీసులు, గని యాజమాన్య పక్షాన్నే నిలిచారు. ఈ ఘర్షణల్లో 8 మంది గని కార్మికులు, ఇద్దరు పోలీసులు మరణించారు. కార్మికుల నడుమ ఈ విధమైన ప్రమాదకర దాడులు, సంఘర్షణ నెలకొంటున్న తరుణంలోనైనా, యాజమాన్యం కానీ, ప్రభుత్వాధికార యంత్రాంగంగానీ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకొనే దిశగా ఏవిధమైన ఒక్క అనుకూల చర్యకూ సిద్ధంకాలేదు. కానీ, దానికి భిన్నంగా సాయుధ పోలీసు పటాలాలను, హెలీకాప్టర్లను, సాయుధ వాహనాలను పెద్దఎత్తున మోహరింపజేసి భాష్పవాయుప్రయోగం, నీటి క్యానన్ల ప్రయోగం, స్టెన్‌గ్రనేడ్ల ప్రయోగంద్వారా ఆందోళన కారులను చెల్లాచెదురు చేయటానికి ప్రభుత్వం పూనుకొంది. ఈ క్రమంలో ఒక పథకం ప్రకారం, మందుగుండు సామాగ్రి, ఆటోమాటిక్ ఆయుధాలతో నున్న సైనిక పటాలాల చక్రబంధంలోకి కార్మికులను తరిమారు. పోలీసుల ఈ చుట్టివేతనుండి తమకు అందుబాటులో నున్న పరికరాలనే ఆయుధాలుగా మలచుకుంటూ బయటపడే ప్రయత్నం చేస్తున్న కార్మికులపై, పోలీసులు క్రూరంగా కాల్పులు జరిపి 34 మందిని అక్కడికక్కడే బలిగొన్నారు. మరో 78 మందిని తీవ్రంగా గాయపరిచారు. ఈ విధంగా, గని కార్మికుల వూచకోత ఉద్దేశ్యపూర్వకంగా, ముందుగా రూపొందించుకున్న పథకంలో భాగంగా జరిగిందే తప్ప, శాంతి భద్రతల పరిరక్షణకోసం పోలీసులు యాదృచ్ఛికంగా జరిపిన ఘటన కానేకాదని రూఢీఅవుతోంది. కానీ, ఆయుధాలతో తిరగబడుతున్న సమ్మెకారులను అదుపు చేయటానికి సాయుధ పోలీసులకు కాల్పులు జరపటం మినహా మరో గత్యంతరం లేకపోయిందని యథాప్రకారం పోలీసు అధికారులు ప్రకటించారు.

ఈ క్రూరమైన హత్యాకాండ అనంతరం, సమ్మెచేస్తున్న గని కార్మికుల భార్యలు, వారివారి భర్తలను కనుగొనలేకపోయారు. వీరంతా పోలీసుల క్రూర హత్యాకాండపట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. పోలీసులు సాగించిన ఈ నరమేధాన్ని నిరసిస్తూ వారంతా ప్లకార్డులు చేబూని, నిరసన ధర్నాలు నిర్వహించారు. జాతివివక్ష వ్యతిరేక ఉద్యమ సందర్భంగా పాడుకున్న పాటలను వారు పాడారు. నిరసన తెలియజేస్తున్న గని కార్మికులపై కాల్పులు జరపవలసిన అగత్యమేమొచ్చిందని వారు పోలీసులను నిలదీశారు.

పోలీసుల ఈ క్రూర హత్యాకాండను, దీనికి దన్నుగా నిలుస్తున్న ఎఎన్‌సి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ దక్షిణాఫ్రికా దేశ వ్యాపితంగా నిరసనలు, ఖండనలు వెల్లువెత్తాయి. వ్యక్తమౌతున్న ప్రజాగ్రహం, ప్రజావ్యతిరేకతలతో భీతిల్లిన ఏఎన్‌సి ప్రభుత్వం, ఆగ్రహంతోనున్న ప్రజలను బుజ్జగించి, వారిని లోబరుచుకునేందుకు సమ్మెకాలంలో చనిపోయిన 44 మంది(గొడవలలో చనిపోయిన పదిమంది, పోలీసు కాల్పులలో చనిపోయిన 34మంది) సంస్మరణలో సంతాప వారంగా పాటిస్తున్నట్లు దేశాధ్యక్షుడు జాకోబ్ జుమా ప్రకటించాడు.

మరోవైపున, లాన్‌మిన్ గనుల యాజమాన్యం ప్రజల ఆగ్రహాన్ని, నిరసనలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా తక్షణం, కార్మికులందరినీ బేషరతుగా సమ్మె విరమించి విధుల్లో చేరవలసిందిగానూ, లేని పక్షంలో వారందరినీ ఉద్యోగాలనుండి తొలగించనున్నట్లుగానూ నిర్లక్ష్యంగా, మొండిగా ఆదేశించింది.

మరణించిన కార్మికుల స్మృత్యర్థం ప్రభుత్వం ఒకవైపున 'సంతాప వారాన్ని' పాటిస్తూ మొసలికన్నీరు కారుస్తూండగానే, సమ్మెచేస్తున్న 259 మంది గని కార్మికులను పోలీసులు అరెస్టుచేసి వారిపై హత్య, హత్యా ప్రయత్నం, సాయుధ దోపిడీ, ప్రజాహింస, ప్రజాధనాన్ని నష్టపరచటం...వంటి అనేక అభియోగాలు మోపి కేసులు నమోదు చేశారు!

అయితే, తమ డిమాండ్ల సాధనకోసం చేసే పోరాటాన్నుండి సమ్మెచేస్తున్న గని కార్మికులు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు, నీరసపడిపోలేదు. వారు నిశ్చయాత్మకంగా నిలబడి పోరు చేస్తున్నారు. 'మాకంటే ముందుగా ప్రాణాలొదిలినవారిలాగే మేమూ ప్రాణాలైనా అర్పిస్తాం కానీ వెనకను మరలేదిలేదు' 'మేము కోరుతున్నది సాధించుకునే వరకూ పోరాటాన్ని సాగించి తీరుతాం', 'పోలీసులు మరోసారి ప్రయత్నించవచ్చు–మమ్మల్ని చంపవచ్చు...కానీ మేము వెనక్కుతగ్గం' అంటూ వారు ప్రకటించటంతో పాటుగా, యాజమాన్య ఆదేశాలను బేఖాతరుచేస్తూ, తమ డిమాండ్లు నెరవేరకుండా తాము తిరిగి విధుల్లో చేరే సమస్యే లేదని తేల్చిచెప్పారు.

ఆగస్టు 23న, మారికానావద్ద జరిగిన కార్మికుల సంస్మరణ కార్యక్రమానికి 6వేల మంది ప్రజలు హాజరయ్యారు. గని కార్మికులు కాల్చిచంపబడిన, రక్తంచిందించిన అక్కడి పంటపొలాల్లో, ఆయా కార్మికుల కుటుంబీకులు అంతిమ సంస్కారాల్ని నిర్వహించారు. ఈ సంస్మరణ, నిరసన కార్యక్రమాలు దక్షిణాఫ్రికా అంతటా పాటించారు.

268మంది గని కార్మికులను అరెస్టుచేసి, న్యాయస్థానంలో హాజరుపరిచే సందర్భంలోనూ కార్మికులు నిరసనలు తెలియజేశారు. 'అమాయకులైన, అరెస్టు చేసిన కార్మికులనందరినీ విడుదల చేయాల'ని వారు నినదించారు.

ఏఎన్‌సి ప్రభుత్వం ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించినప్పటికీ, విచారణాంశాలను గమనిస్తే, వాస్తవాలను వెలికితీసేందుకు ఈ విచారణ ఉద్దేశించింది కాదనేది స్పష్టమౌతోంది. అయితే, గని కార్మికుల సమ్మె చట్టవిరుద్ధమైనదనీ, చట్టవిరుద్ధంగా ఆయుధాలతో నిరసనలు తెలపటంవంటి చర్యలే పోలీసు కాల్పులకు కారణమనీ తేల్చి, పోలీసుల హత్యాకాండ న్యాయసమ్మత మైనదేనని తేల్చటానికి వుద్దేశించిన విచారణే తప్ప ఇది–మరోటి కాదు.

ఏమైనా, గనుల రంగంలో పనిచేస్తున్న కార్మికుల మనోధైర్యాన్ని పోలీసుల ఈ హత్యాకాండ ఘటన ఏవిధంగానూ సడలించలేక పోయింది. అందుకు భిన్నంగా, దక్షిణాఫ్రికా వ్యాపితంగా గని కార్మికులలో మరింత పోరాట స్ఫూర్తిని రగిల్చింది. గనుల రంగంలోని ఇతర కంపెనీలకు కూడా ఈ సమ్మె విస్తరిస్తోంది. లాన్‌మిన్‌కు దగ్గరలోని రాయల్ బఫోకెంగ్ అనే గనిలోని కార్మికులూ సమ్మెబాట పట్టారు. 7 వేలమంది ఈ గని కార్మికులు తమ వేతనాలను పెంపుచేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22 నుండి సమ్మె చేస్తున్నారు.

ఆగస్టు 17న, ప్రపంచంలో అతిపెద్దలోహ ఉత్పత్తి సంస్థ అయిన ఆంగ్లో–అమెరికన్ ప్లాటినం పరిశ్రమకు చెందిన కార్మికులు–గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ 'ఎన్‌యుఎమ్' ద్వారా కాక, నేరుగా కంపెనీ యాజమాన్యాన్ని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గని కార్యకలాపాలద్వారా, ఉత్పత్తి అయిన ప్లాటినం తదితర లోహాలను ఉత్పత్తి చేసి ఎగుమతులు చేయటం ద్వారా, సూపర్‌లాభాలు గడిస్తున్న గనుల యజమానులకు, ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్న బడాపారిశ్రామిక వేత్తలకు, కార్మికులలో వేగంగా విస్తరిస్తున్న ఈ అశాంతి, అసంతృప్తులు పెద్ద సవాల్‌గా వున్నాయి.

దక్షిణాఫ్రికా సహజ వనరులన్నింటినీ జాతీయం చేయవలసిందిగా మార్క్సిస్టు – లెనినిస్టు లిస్టు (ఎంఎల్‌ఎల్)కు చెందిన యూత్ లీగ్ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది. అదే విధంగా, భూముల బేదఖల్‌ను లెక్కగట్టేందుకు కమిషన్‌ను నియమించాలని, సాసోల్, కుమ్బ్రోనోర్ తదితర బడాపరిశ్రమలను జాతీయం చేయాలని, ప్రపంచంలో అతిపెద్ద ఉక్కుదిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ కంపెనీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇనుము, ప్లాటినం, జింక్ తదితర ఖనిజ సంపదలన్నింటినీ జాతీయం చేయాలని ఈ సంస్థ డిమాండ్ చేసింది. అలాగే, గని కార్మికులందరికీ 1250 రాండ్లకు (895 పౌండ్లకు) తక్కువగాకుండా కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేసింది.

ఈ విధంగా నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న పెట్టుబడిదారీ వ్యూహం యొక్క అత్యంత సహజ ప్రతిఫలనంగా, గని కార్మికుల ఊచకోత సంఘటన చోటు చేసుకుంది.

**అసమానత్వానికి, దోపిడీకి, అణచివేతకు అసలైన కారణంగావున్న పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, దానిస్థానంలో దోపిడీ, అసమానతలకు తావులేని సామ్యవాద వ్యవస్థ స్థాపనగావించేందుకు కార్మికవర్గం–తన వర్గ రాజకీయాలతో సాయుధమవ్వాల్సిన అవసరాన్ని ప్రస్తుత గని కార్మికుల ఊచకోత ఘటన–నొక్కి చెప్పటంతో పాటు, పెట్టుబడిదారీవర్గం సాగించే ప్రమాదకర దాడులను ప్రతిఘటించేందుకు కార్మికులు, కార్మికవర్గం నడుమ ఐక్యతావశ్యకతను పునరుద్ఘాటిస్తోంది.**

**ప్రపంచవ్యాపితంగా వున్న కార్మికవర్గం – ఎ) పెట్టుబడిదారీ వ్యవస్థ బి) క్రూరమైన, అమానవీయ దోపిడీ సాగిస్తున్న పారిశ్రామిక పెట్టుబడిదారీ యాజమాన్యాలు సి) పాదుకుపోయిన, సాంప్రదాయక, నిరంకుశ కార్మిక యూనియన్ల కేంద్ర నాయకత్వాలు– అనే మూడు ప్రధాన శత్రువులపై పోరాడాలనే, దోపిడీ, అసమానత్వాలను, అణచివేతలను భూమండలం మీద నుండి అంతం చేయాలనే తమ సహజ ఆకాంక్షలను కార్మికవర్గం గుర్తెరగాలని దక్షిణాఫ్రికాగని కార్మికుల ఊచకోతఘటన హెచ్చరిస్తోంది.**

✡

# రైతుల సొమ్ముతో బీమా కంపెనీల వ్యాపారాన్ని వృద్ధి చేస్తున్న ప్రభుత్వం

**కరువులు,** వరదలు, తుఫాన్లు, చీడపీడలు, నీటిముంపు, వడగళ్ళ వాన మొదలైన ప్రకృతి వైపరీత్యాల వలన పంటలకు తీవ్ర నష్టంవాటిల్లినా రైతాంగానికి ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయమూ లభించక, అప్పులపాలై భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. నష్టపోయిన బడాపరిశ్రమాధిపతులకు పెద్దఎత్తున పరిహారం అందిస్తున్న పాలకులు, రైతాంగానికి ఎటువంటి సహాయం అందించకపోవటంపై తీవ్రమైన విమర్శలతోపాటు, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు, రైతుకూలీ సంఘాల నాయకత్వంలో అనేక ఆందోళనలు సాగుతూవచ్చాయి. రైతు సంక్షేమాన్ని కోరుకునే వ్యవసాయశాస్త్రవేత్తలు, ప్రజాతంత్రవాదులు ఈ ఆందోళనలకు అండగా నిలిచారు. రైతుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకొంటామనీ, అందుకోసం పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లుగా తప్పనిసరి పరిస్థితుల్లో 1972లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ బీమా పథకం నిబంధనలు, అమలు తీరుతెన్నులు పరిశీలిస్తే, ఈ పథకం రైతుల ప్రయోజనం కోసంకంటే, బీమా కంపెనీల ప్రయోజనాలకే తోడ్పడుతున్నదని స్పష్టమౌతున్నది.

జాతీయ వ్యవసాయ బీమా సంస్థ ద్వారా దేశంలో 12 బీమా పథకాలు అమల్లో ఉన్నాయి. జీవ-ఇంధన మొక్కలు, యాలుక చెట్లు, కొబ్బరి చెట్లు, ఆలుగడ్డ, కొయ్యగుజ్జు చెట్లు, కాఫీ మొక్కలు, రబ్బరు తోటలకు విడివిడిగా వర్తించే బీమా పథకాలు ఉన్నాయి. ఇవికాక జాతీయ వ్యవసాయ బీమా పథకం, వాతావరణ బీమా పథకాలు వున్నాయి. భారత వ్యవసాయ బీమా సంస్థ ద్వారా 1985-1999 సంవత్సరం వరకు 'సమగ్ర వ్యవసాయ బీమా పథకం' అమలు జరిగింది.

జాతీయ వ్యవసాయ బీమా పథకం ద్వారా వివిధ పంటలకు చెల్లించవలసిన బీమా ప్రీమియంను బీమా కంపెనీలు ప్రకటిస్తూ వస్తున్నాయి. అందులో భాగంగా 2009లో రాష్ట్రంలోని వివిధ పంటలకు ప్రభుత్వం ప్రకటించిన బీమా ప్రీమియం ఈ విధంగా ఉంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రీమియం చెల్లింపులో రాయితీ యిచ్చింది. ఈక్రింది పట్టికద్వారా బీమాచేయబడిన విస్తీర్ణం, చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు గమనించవచ్చు.

| బీమా చేయుపంటలు | బీమా చేయుమొత్తం (ఎకరాకు రూ॥) | ప్రీమియంశాతం | రైతులు ఎకరాకు కట్టవలసిన ప్రీమియం (రూ॥లలో) | |
|---|---|---|---|---|
| | | | పెద్దరైతులు - | చిన్నరైతులు |
| వరి | 11,320 | 2.50 | 283.00 | 254.70 |
| జొన్న | 2,560 | 2.50 | 64.00 | 57.60 |
| మొక్కజొన్న | 6,640 | 2.50 | 161.00 | 144.90 |
| మినుము | 2,880 | 2.50 | 72.00 | 64.80 |
| పెసర | 2,440 | 2.50 | 66.00 | 59.40 |
| సోయాచిక్కుడు | 7,400 | 1.70 | 125.00 | 113.22 |
| వేరుశనగ (నీటిఆధారం) | 5,720 | 3.50 | 200.20 | 186.18 |
| వేరుశనగ (వర్షాధారం) | 3,446 | 3.50 | 120.40 | 108.36 |
| చెరకు (ప్లాంట్) | 39,160 | 2.95 | 1155.22 | 1039.70 |
| పత్తి (నీటి ఆధారం) | 20,600 | 3.80 | 782.80 | 704.52 |
| పత్తి (వర్షాధారం) | 18,240 | 7.00 | 1276.80 | 1149.12 |
| మిరప (నీటిఆధారం) | 74,400 | 4.35 | 3236.40 | 2912.76 |
| మిరప (వర్షాధారం) | 68,160 | 6.45 | 4396.40 | 3956.69 |
| అరటి | 66,840 | 6.10 | 4016.24 | 3614.62 |
| పసుపు | 75,600 | 6.15 | 4951.80 | 4456.62 |

పై పట్టికను పరిశీలిస్తే పసుపు, అరటి, మిరప పంటలకు తప్ప మరే పంటలకూ పంట ఖర్చులు కూడా బీమా చేయలేదని అర్ధమౌతుంది. 2009 తర్వాత వరిపంటకు 354 రూ॥, పెసర పంటకు 77 రూ॥, మరికొన్ని ఆహార పంటలకు బీమా ప్రీమియంను పెంచి, వాణిజ్య పంటలకు మాత్రం తగ్గించింది.

## పెరిగిన ప్రీమియం రేట్లు

రైతాంగానికి మరింత ప్రయోజనంగా ఉండే విధంగా జాతీయ వ్యవసాయ బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నామని పాలకులు చెప్పి, దానికి 'మెరుగుపర్చిన జాతీయ వ్యవసాయ బీమా పథకం'గా పేరుపెట్టారు. ఇది రైతుల ప్రయోజనం కోసం అంటూ, ఆచరణలో బీమా సంస్థలకు మరింత ఎక్కువగా రైతుల సొమ్మును దోచిపెట్టటమే ఈ పథక ఉద్దేశ్యమని పెంచిన ప్రీమియం రేట్లే తెలియచేస్తున్నాయి. ఈ బీమా పథకం లేకముందు వరికి ఎకరాకు 354 రూ॥ రైతులు ప్రీమియం చెల్లిస్తే, ఇప్పుడు 706 రూ॥ ప్రీమియం చెల్లించవలసి వస్తుంది. పెసరకు 77 రూ॥ నుండి 304 రూ॥ చెల్లించాల్సి వస్తుంది. ఈ విధంగానే అనేక పంటలకు కూడా 'మెరుగుపరిచిన జాతీయ బీమా పథకం' వలన చెల్లించాల్సిన ప్రీమియం రేట్లు పెరిగాయి.

## బీమా పథకాల పట్ల రైతులకు అవగాహన కల్పించని ప్రభుత్వం

పంటల బీమా పథకాలు ఉన్నాయనే విషయం ఇప్పటికీ 50 శాతం పైగా రైతులకు తెలియదు. ఇందుకు సంబంధించిన అవగాహనను రైతులకు-పాలకులు, అధికారులు కల్పించటం లేదు. పంటలకు నిర్ణయించిన ప్రీమియం చెల్లించి, రైతులు బీమా పథకాల్లో చేరవచ్చు. మొదట బ్యాంకుల్లో రుణం తీసుకొన్న రైతులకే దీన్ని వర్తింపచేశారు. ఇప్పుడు దాన్ని సడలించి, బ్యాంకులో పంటరుణం తీసుకోనివారుకూడా ప్రీమియం రేటు చెల్లించి పంటల బీమా పథకంలో చేరవచ్చని ప్రకటించారు. బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకొనేవారు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలి. దాన్ని రుణం నుండి బ్యాంకులే మినహాయిస్తాయి. అందుకు వ్యతిరేకించిన రైతులకు, బ్యాంకులు రుణాలు ఇవ్వబోమంటున్నాయి. ప్రీమియం చెల్లించనప్పుడు 'మాకు గ్యారంటీ ఏమిట'ని ప్రశ్నిస్తున్నాయి. పంటరుణాలు తీసుకునే చాలామంది రైతులకు, తాము పంటలబీమా ప్రీమియం చెల్లిస్తున్నట్లు తెలియదు. బ్యాంకులు వారికి తెలియచెప్పటం లేదు. దీన్ని గమనిస్తే పంటల బీమా పథకం రైతాంగానికి సహాయం అందించటానికన్నా, బ్యాంకులు తమ రుణ చెల్లింపుకు గ్యారంటీగా వాడుకుంటున్నాయి.

పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు, వివిధ పంటలకు తుదిగడువును బీమా సంస్థలు నిర్ణయించాయి. జాతీయ వ్యవసాయ బీమా పథకంలో చేరడానికి ఆఖరుతేదీ జులై 31; వాతావరణ పంటల బీమా పథకంలో చేరటానికి జులై 10; పత్తి, టమోటా, వేరుశనగ పంటలకు ప్రీమియం చెల్లించే ఆఖరు తేదీ కూడా జులై 10తో ముగుస్తుంది. ఆ తర్వాత ప్రీమియం చెల్లింపులకు నిబంధనలు అంగీకరించవు. ఈ గడువులోపు 30 శాతం రైతులకు కూడా రుణాలు అందటంలేదు. అయినా, ఆ తర్వాత రుణాలు పొందే రైతులనుండి కూడా బ్యాంకులు ప్రీమియం మొత్తాన్ని మినహాయిస్తున్నాయి. ఈ విధంగా ప్రీమియం చెల్లించినప్పటికీ, రైతులకు బీమా సౌకర్యం పొందే అవకాశం మాత్రం ఉండదు. అలాంటప్పుడు రుణాల నుండి ప్రీమియం ఎందుకు మినహాయించుకొంటున్నట్లు? ఆ డబ్బు ఏమి చేస్తున్నారు? ఇది రైతులను, బ్యాంకులు దోపిడీ చేయటం కాదా!?

## పనికిమాలిన బీమా పరిహార నిబంధనలు

పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించటానికి ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు చూస్తే, రైతాంగానికి అందే సహాయం ఏమిటన్న ప్రశ్న వెంటనే వస్తుంది. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం మొదట మండల స్థాయిలో వర్తింప చేసింది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించటానికి బదులు, పంటల వారీగా కాలాన్ని నిర్ణయించి నష్టాన్ని అంచనా వేసే విధానాన్ని పాలకులు అమలు జరిపారు. వరి, గోధుమలకు 3 సంవత్సరాలు, మిగతా పంటలకు ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో పంట నష్టాన్ని అంచనా వేస్తారు. దీని ప్రకారం మండలంలోని అత్యధిక గ్రామాల్లో యాభై శాతంకన్నా పంట దిగుబడి తగ్గితేనే రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారు. ఒక సంవత్సరం పంటలు పూర్తిగా నష్టపోయినా 3-5 సంవత్సరాల పంటల ఉత్పత్తిని లెక్కించి సగటు పంట నష్టం 50% కన్నా ఎక్కువ ఉంటేనే, రైతులకు పరిహారం అందుతుంది. ఇలాంటి పనికిమాలిన నిబంధనల వలన పంటల బీమాపథకాలు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరటంలేదు. ఇలాంటి నిబంధనలు మార్చాలని, మండలాన్ని యూనిట్‌గా కాక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, ఏ సంవత్సరం పంట నష్టాన్ని ఆ సంవత్సరమే అంచనావేసి అందుకు అనుగుణంగా పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో రైతాంగం ఆందోళన ప్రారంభించింది.

రైతాంగం ఆందోళనలు ఎక్కువకావటం, వారు చేస్తున్న డిమాండు న్యాయబద్ధంకావటం, ప్రజాతంత్ర వాదుల, రైతు, రైతుకూలీసంఘాల మద్దతు పొందటంతో తప్పని సరి పరిస్థితుల్లో రైతుల డిమాండుని ఆమోదిస్తూనే, మొదట రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అదీ ఒక్కొక్క పంటకు మాత్రమే 2005 నుండి అమలు పరుస్తానని ప్రభుత్వం చెప్పింది. క్రమంగా అన్ని జిల్లాలకు దీనిని విస్తరిస్తానని పేర్కొంది. అనంతపురం జిల్లాలో వేరుశనగ, ప్రకాశం జిల్లాలో కంది, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆముదం, కరీంనగర్‌జిల్లాలో మొక్కజొన్న పంటలను ఎంపిక చేసింది. 2007లో 10 జిల్లాల్లో గ్రామ యూనిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉభయగోదావరి జిల్లాలు, విజయనగరం జిల్లాల్లో వరి; కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో వేరుశనగ; ప్రకాశం జిల్లాలో కంది; మెదక్, మహబూబ్ నగర్, కరీంనగర్ జిల్లాల్లో మొక్కజొన్న పంటలను ఎంపిక చేసింది. వీటితోపాటు జిల్లాల్లో అనేక పంటలు పండిస్తారు. ఆ పంటలు నష్టపోయినా ఈ పథకం ప్రకారం ఎటువంటి పరిహారం రైతులకు అందదు.

ప్రభుత్వం అనుసరించిన గ్రామ యూనిట్ విధానం ఎడల రైతుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకొంది. దీన్ని గమనించిన ప్రభుత్వం మరికొన్ని పంటలను గ్రామ యూనిట్ పరిధిలోకి తెస్తామని చెప్పిన కొద్దిరోజులకే దాన్నుండి వైదొలిగింది. 2009లో నాలుగు (వరి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబీన్) పంటలకే వర్తింప చేస్తానని ప్రకటించింది. దీన్ని ఖరీఫ్ 2009 పంటల బీమా పథకంగా వ్యవసాయ బీమా సంస్థ ప్రకటించింది. అందుకు మార్గదర్శకాలను ప్రకటించింది.

- చిన్న-సన్నకారు రైతులకు 10% రాయితీ ప్రకటించింది.
- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో వరి పంటను ప్రధాన పంటగా నిర్ణయించింది.
- చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో వేరుశనగపంట
- రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, జిల్లాల్లో మొక్కజొన్న; ఆదిలాబాద్ జిల్లాలో సోయాబిన్ పంటలను నిర్ణయించింది.

మిగిలిన పంటలన్నిటికీ మండలస్థాయి యూనిట్ క్రింద బీమా వర్తించే పంటలుగా చేర్చింది. పత్తివిస్తీర్ణం పెరుగుతున్నా దాన్ని ప్రధానపంటగా వ్యవసాయ బీమా సంస్థ గుర్తించలేదు. ప్రస్తుతం రాష్ట్రమంతటా గ్రామయూనిట్ విధానం అమల్లోకి వచ్చింది.

## లోపభూయిష్టమైన బీమావిధానం

పంటల బీమా విధానమే లోపభూయిష్టంగా ఉంది. బీమా ప్రీమియం సేద్యంపై ఖర్చులకు మాత్రమే చెల్లించుకొంటున్నారు. ఇది సరైందికాదు. వరిపంటనే తీసుకొంటే ఎకరానికి నేడు 30 నుండి 40 బస్తాలు దాకా పండుతుంది. ప్రస్తుతం మార్కెట్ ధర 75 కేజీల బస్తా ధర రూ॥ 13 వందలు దాకా ఉంది. 40 వేల దాకా ఆదాయం వస్తుంది. నష్టమనేది ఈ ఆదాయం మొత్తానికీ వర్తిస్తుంది. అందువలన ఆ మొత్తానికి బీమా ప్రీమియం తీసుకోవాలి. ఆ విధంగా కాకుండా పంట ఖర్చులకు మాత్రమే బీమా ప్రీమియం నిర్ణయించటంవలన రైతులకు లభించే బీమా పరిహారం నామమాత్రంగా, నిరుపయోగంగా తయారైంది. పంటఖర్చులను కూడా చాలా తక్కువగా ప్రకటిస్తున్నది. అందువలన బీమా ప్రీమియం మొత్తం పంట విలువకు నిర్ణయించాలి.

## కొందరికే అందుతున్న పరిహారం

రాష్ట్రంలో ఒక కోటీ 20 లక్షల మంది రైతులు ఉంటే, వీరిలో పంటల బీమా చేసిన రైతులు ఐదవ వంతు మాత్రమే! వీరందరికీ కూడా బీమా పరిహారం అందటంలేదు. వీరిలో 15 శాతంలోపు రైతులకే పరిహారం అందుతున్నది. 2000 నుండి 2007 వరకు బీమా పరిహారం అందిన రైతులే ఇందుకు నిదర్శనం.

| సంవత్సరం | ఖరీఫ్‌లో బీమాచేసినవారు | పరిహారం పొందినవారు | రబీలో బీమా చేసినవారు | పరిహారం పొందినవారు |
|---|---|---|---|---|
| 2000 | 17,77,222 | 1,23,849 | 2,15,048 | 27,386 |
| 2001 | 15,65,772 | 2,87,949 | 2,09,682 | 15,381 |
| 2002 | - | - | 1,45,380 | 40,315 |
| 2003 | 14,99,992 | 3,31,889 | 2,35,322 | 47,000 |
| 2004 | 23,56,418 | 2,85,505 | 2,35,941 | 27,883 |
| 2005 | 19,79,920 | 6,61,575 | 2,67,497 | 10,444 |
| 2006 | 19,64,838 | 6,42,524 | 2,94,303 | 40,588 |
| 2007 | 21,10,658 | 14,092 | 2,22,764 | 10,743 |

ఆ తర్వాత సంత్సరాల్లో కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. పై పట్టికను పరిశీలిస్తే బీమా చేసిన రైతుల్లో చాలా తక్కువ మందికి మాత్రమే పరిహారం అందింది. ఎటువంటి ఆధారంలేని కౌలు రైతులకు అసలు పరిహారమే అందలేదు. బీమా సంస్థలు, రైతాంగం చెల్లించిన ప్రీమియం మొత్తం అంత మోతాదు కూడా, పరిహారం క్రింద చెల్లించటం లేదు. 2007 ఖరీఫ్, రబీలలో రైతాంగం చెల్లించిన ప్రీమియం మొత్తంలో 11.45 కోట్లు మాత్రమే పంట నష్టపరిహారం క్రింద బీమా కంపెనీలు చెల్లించాయి. 2008లో రైతులు 98 కోట్లు ప్రీమియం చెల్లించగా, బీమా కంపెనీలు 88.05 కోట్లు మాత్రమే చెల్లించాయి. ఒక వేళ రైతులకు ప్రీమియం మొత్తం కన్నా ఎక్కువ చెల్లించాల్సివస్తే, దాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. బీమా సంస్థలు మాత్రం చెల్లించవు. ఆ మేరకే బీమా సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నాయి. ఇలాంటి సందర్భంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, తమవాటాల చెల్లింపులో జాప్యం చేస్తూ, సంవత్సరాల తరబడి రైతులకు పరిహారం చెల్లించటంలేదు. బీమా వ్యవహారాలన్నీ అగ్రికర్చల్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పరిధిలోనే జరుగుతున్నాయి.

బీమా నిబంధనల ప్రకారం, బీమా చేసిన వారికి మధ్యలో ఆపదవస్తే, చెల్లించిన బీమా మొత్తం తిరిగి ఇవ్వాలి. ఎటువంటి అవాంతరాలూ లేకపోతే, బీమా కాలం పూర్తి అయిన తర్వాత బీమా మొత్తం చెల్లిస్తారు. కానీ, రైతులు చెల్లించే బీమా ప్రీమియంకు మాత్రం కంపెనీలు ఆ విధానాన్ని అనుసరించటంలేదు. బీమా ప్రీమియం చెల్లించిన రైతులు పంట నష్టపోనప్పుడు, కంపెనీలు ఎటువంటి పరిహారం ఇవ్వకపోగా, చెల్లించిన ప్రీమియం కూడా తిరిగి ఇవ్వటం లేదు. అలాంటప్పుడు బీమా డబ్బును, కంపెనీలు ఏమి చేస్తున్నాయి? బీమా కంపెనీల నుండి పాలకులు ఆ డబ్బును రైతులకు ఎందుకు ఇప్పించటం లేదు? ప్రీమియం మొత్తంకన్నా అధికంగా చెల్లించే డబ్బును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నప్పుడు, పరిహారం చెల్లించే బాధ్యతను ప్రభుత్వాలే చేపట్టవచ్చుగదా! బీమా కంపెనీలకు ఎందుకు అప్పగించినట్టు?

## రైతులకు అందని పరిహారం

ప్రకృతి వైఫల్యాల వలన పంటలు నష్టపోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, వారి కంటి తుడుపుగా కూడా పంటల బీమా పథకం ఉపయోగపడటంలేదు. చాలా మందికి పరిహారం అందకపోగా, కొందరికి నామమాత్రం పరిహారం ప్రకటించినా, అదికూడా రైతులకు అందటం లేదు. బ్యాంకులే నేరుగా రైతుల అప్పు క్రింద జమవేసు కొంటున్నాయి. ఆర్థికంగా అల్లాడుతున్న రైతాంగానికి కనీస ఊరట కూడా దొరకటంలేదు. ప్రభుత్వం,

(తరువాయి 7వ పేజీలో)

# బీళ్ళుగా మారుతున్న తెనాలి డివిజన్ భూములు

**ఈ** సంవత్సరం ఖరీఫ్ తరుణం ముగింపుకి వచ్చినా సేద్యం నామ మాత్రంగానే జరిగింది. ఇప్పటివరకు రాయలసీమ, తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలు మరియు కోస్తాలోని నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు కరువు పీడిత ప్రాంతాలుగా కొనసాగుతుంటే, ఆ జాబితాలోకి ఇప్పుడు క్రిష్ణా డెల్టాకూడా చేరుతున్నది. ఈ డెల్టా పరిధిలో ఆగస్టు చివరికి నాట్లు పూర్తికావాల్సి ఉండగా 30%లోపే పూర్తి కావటం, అది కూడా నీరు లేక ఎండిపోయే పరిస్థితులు ఏర్పడటమే ఆ విధంగా భావించాల్సివస్తున్నది.

కృష్ణాబ్యారేజ్ ద్వారా ప్రకాశం, గుంటూరు, క్రిష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 13.02 లక్షల ఎకరాలకు సేద్యపునీరు అందుతుంది. అనధికారికంగా ఇంకావేలాది ఎకరాల్లో రైతులు సేద్యం చేస్తున్నారు. అలాగే నాగార్జునసాగర్ కుడిఎడమ కాల్వల ద్వారా గుంటూరు జిల్లా పల్నాడు ఏరియా, నల్గొండ, ఖమ్మంజిల్లాలకు చెందిన 23 లక్షల ఎకరాలకు సేద్యపునీరు అందాలి. ఈ రెంటిక్రిందా నేడు సేద్యం ప్రశ్నార్థకంగా మారింది.

క్రిష్ణా బ్యారేజీ ఆయకట్టు రైతాంగం ఇంతపెద్ద ఎత్తున సాగునీటి సమస్యను ఎదుర్కొవటం బహుశ ఇదే ప్రథమం కావచ్చు. క్రిష్ణా డెల్టాలోనూ, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోనూ సేద్యపు నీరు అందకపోవటానికి ప్రకృతే కారణమని వ్యవసాయమంత్రి చెప్పటం ద్వారా, పాలకుల బాధ్యతను మరుగుపర్చ చూస్తున్నారు. ప్రకృతికన్నా, పాలక ప్రభుత్వాలు బాధ్యత ఎక్కువన్న వాస్తవాన్ని రైతాంగం గ్రహిస్తున్నది. ప్రస్తుత సేద్యానకి నీటి కొరతకు ప్రకృతికన్నా ఎక్కువ కారణం పాలకుల విధానాలే.

రాష్ట్రంలో అపారమైన జలవనరులు ఉన్నాయి. క్రిష్ణా, గోదావరి, వంశధార, పెన్నా మొదలగు నదులతోపాటు, వేలాది చెరువులు, బావులు, వాగులు, గడ్డలు ఉన్నాయి. వీటితోపాటు అపారంగా భూగర్భజలాలు ఉన్నాయి. దేశంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉండటం గమనించాల్సిఉంది. రాష్ట్ర ప్రయోజనం, రైతుల ప్రయోజనం కోరుకునే పాలకులైతే అన్నిరకాల నీటివనరులను సరైన విధంగా వినియోగించేవారు. భారీ వర్షాలు, తుఫాన్‌ల వలన వచ్చే నీరును నిల్వచేసేందుకు ఆనకట్టలు, బ్యారేజీలు, రిజర్వాయర్లతో పాటు అవసరమైన చోట ప్రాజెక్టు నిర్మించటంతో పాటు, గతంలో ఎంతో ప్రాధాన్యత వహించి చెరువులను సంరక్షించి, వరద, వర్షపు నీటితో వాటిని నింపేవారు. తద్వారా సాగు-త్రాగునీరుతో పాటు ముంపు నియంత్రించటంతో పాటు, నష్టాలను కూడా చాలా వరకు తగ్గించగలిగేవారు. అలాంటి విధానాలులేని కేంద్ర-రాష్ట్ర పాలకులు అందుకు విరుద్ధమైన విధానాలు అనుసరిస్తున్నారు.

వ్యవసాయం ఎడల, నీటి వినియోగం ఎడల పాలకులకు ఒక విధానమంటూ లేకుండా పోయింది. ముఖ్యంగా జలాశయాల నీటి వినియోగప్రాధాన్యతను విస్మరించి ఇష్టం వచ్చిన విధంగా వినియోగిస్తున్నారు. నాగార్జునసాగర్, కృష్ణా, ధవళేశ్వరం బ్యారేజ్‌ల నీటిని సాగు-త్రాగునీటికే మొదటి ప్రాధాన్యత. ఆ తర్వాతే ఇతర అవసరాలకు వినియోగించాలి. ప్రభుత్వం దీన్ని ఉద్దేశ పూర్వకంగా విస్మరించింది. కరెంట్ ఉత్పత్తికి మొదటి ప్రాధాన్యత యిస్తూ సేద్యాన్ని ఎండగడుతున్నది. ఫలితంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే సేద్యం సజావుగా సాగని పరిస్థితి ఏర్పడింది. నేటి కృష్ణా డెల్టా పరిస్థితికి అదే కారణం.

కృష్ణా బ్యారేజ్ 12 అడుగుల నీటి మట్టాన్ని మాత్రమే నిల్వఉంచగలుగుతుంది. అంతకు మించిన నీరంతా సముద్రపు పాలౌతున్నది. విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు తర్వాత దాని కరెంటు ఉత్పత్తి కోసం బ్యారేజీ నీటిని వినియోగించటం ప్రారంభించారు. థర్మల్ కేంద్రానికి నీరు విడుదల కావాలంటే బ్యారేజీవద్ద 11 అడుగుల నీటిమట్టం ఉండాలి. అంతకు మించి ఉంటేనే కాల్వలకు నీరు విడుదల చేస్తున్నారు. 2002 ఇలాంటి సమస్య ఏర్పడి రైతాంగం పెద్దఎత్తున ఆందోళనకు దిగటంతో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు థర్మల్ కేంద్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవటానికి 120 కోట్లు దానికి ఇవ్వటం జరిగింది. పైపులు బిగించి మోటార్లద్వారా నీటిని తోడుకోవాలి. పైపులు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ కేంద్ర అధికారులు వాటి ద్వారా నీటిని తోడే చర్యలు ఇంతవరకు చేపట్టలేదు. సాగునీటి ఎద్దడి ఇప్పుడు తీవ్రంగా ఉన్నా ఆ పని చేయకుండా బ్యారేజీ నీటినే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం కూడా దీన్ని ప్రశ్నించటం లేదు. క్రిష్ణా డెల్టాకి నీరువదలాలని ప్రతిపక్ష పార్టీలు, కొన్ని రైతుసంఘాలు ఆందోళన చేస్తున్నాయి. సాగర్ నీటిని బ్యారెజ్‌కి వదలాలని డిమాండ్ చేస్తున్నాయికాని, బ్యారేజీలు, రిజర్వాయర్ల ప్రాధాన్యతను; థర్మల్ కేంద్రానికి వున్న ప్రత్యామ్నాయాన్ని వాడుకోక పోవటాన్ని ప్రశ్నించటంలేదు. కారణం వారు అధికారంలోకి వచ్చిన తర్వాత చేసేపని అదే కాబట్టి!

సాగర్ కుడి-ఎడమ కాల్వలకు కూడా ఆగస్టు రెండవ వారంలో నీరు విడుదల చేయాలి. ఇంతవరకు కాల్వలకు నీరు విడుదల చేయలేదు. నీటిమట్టం పడిపోవటం వలన నీరు వదలటం సాధ్యం కాదని ప్రభుత్వం చెబుతున్నది. చివరకు సాగునీరు యివ్వలేమని ప్రకటించింది. మాచర్ల, రెంటచింతల, కారంపూడి మొదలైన మండలాల్లో ఇంజన్ల ద్వారానూ, ఇతరత్రా సాగుచేసిన భూముల్లోని పైర్లను రక్షించుకోవటానికి పడరాని పాట్లు పడుతున్నారు. మంచినీటికి నీరు వదలినప్పుడు కాల్వగుంటల్లో ఉన్న నీటిని పైపుల ద్వారాను, కూలీలనుపెట్టి పైర్లను తడుపుతున్నారు. ఇందుకు ఎకరాకి రెండువేలుదాకా అవుతుంది. మిర్చి, పత్తిపంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాలో సాగయ్యే ప్రధాన పంట వరి. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో డెల్టా ప్రాంతం కీలక పాత్రవహిస్తున్నది. వరితప్ప ఇతర పంటలు వేయని రైతాంగం నీటి ఎద్దడి పేరుతో ప్రభుత్వం కాల్వలకు నీరు విడుదల చేయటం లేదని చెప్పటంతో తీవ్ర ఆందోళనకు గురైనారు. నారుపోసుకోవ టానికి తరుణం మించిపోతుండటంతో నీటి విడుదల కోసం ఆందోళన చేపట్టారు. ఆందోళన తీవ్రరూపందాల్చే పరిస్థితిని గమనించిన ప్రభుత్వం సాగర్ నుండి బ్యారేజికి నీరు విడుదల చేసి నారుమళ్ళకు మాత్రమే నీరు వదులుతామని, వాటిని సేద్యానికి ఉపయోగించరాదనే ఆంక్షలను విధించింది.

సాగునీటి కొరత ఏర్పడటానికి అసలు కారణాన్ని తెలుసుకుని రైతాంగం దాని పరిష్కారం కొరకు సంఘటిత పడకుండా చేసేందుకు ప్రాంతీయ విద్వేషాలు రగిల్చేందుకు పాలకులు పూనుకున్నారు. తమ ప్రాంతానికి నీరు లేకుండా చేసి కృష్ణాజిల్లా డెల్టాకిస్తున్నారంటూ నాగార్జునసాగర్, శ్రీశైలంల నుండి నీరువదలరాదంటూ హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుతో ప్రభుత్వం నీటి విడుదల ఆపివేసింది. పాలకవర్గ పార్టీలే దీనికి పూనుకున్నాయి. మరోవైపున రిజర్వాయర్లు నిండినా చుక్కనీరు కూడా వదలకుండా కర్ణాటక బిగపట్టుతున్నదంటూ దృష్టిమరల్చే ప్రచారం ప్రారంభించారు.

ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో కృష్ణానదిపై ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయింది. ప్రతి నాలుగేళ్లలో ఒక ఏడాది వర్షాభావ పరిస్థితి ఏర్పడుతుంది. నేటి దుస్థితి ఇక ముందు పునరావృతమయ్యే అవకాశాలే ఎక్కువగా వున్నాయి. బచావత్ ఆవార్డులో ఎగువ రిజర్వాయర్లు నిండిన తర్వాత నీరు క్రిందికి వదలాలని ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టి లేకుండా అంగీకరించింది. ఈ పొరపాటును సవరించుకుని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట, పడిన వానను దామాషా పద్ధతిలో పంచుకుంటామని చెప్పి వుంటే, ఇప్పటి సాగునీటి కొరత నివారించగలిగివుండేది. దీనికి బదులుగా ఆలమట్టి డ్యాము ఎత్తుగురించి అనవసర వివాదంతో కాలం వెళ్ళబుచ్చింది. డ్యాము ఎత్తు ఎంతవున్నా దామాషా పద్ధతిని కోరివుంటే నీరు వచ్చివుండేది. ఇప్పటికీ పరిస్థితిని సరిచేసే ఆలోచన చేయకుండా, కొంత నీరువదలమని కర్ణాటకను కోరతామని ప్రకటనలు చేస్తున్నది.

కృష్ణా డెల్టా నీటి విడుదలపై చర్చ జరుగుతున్న సందర్భములోనే ఆగస్టు **(తరువాయి 6వ పేజీలో)**

## ప్రజలపై భారాన్ని పెంచుతున్న గట్టుభీమవరం టోల్‌ప్లాజాను నిరసిస్తూ ఆందోళన

**జాతీయరహదారి-9పై** విజయవాడ-హైదరాబాద్‌ల నడుమ, హైదరాబాద్‌కు 40 కి.మీ తర్వాత నుండి 221 కి.మీ వరకూ మొత్తం 181 కి.మీ. రోడ్డును నాలుగులైన్లుగా నిర్మించటానికి జిఎంఆర్ సంస్థ కాంట్రాక్టుని దక్కించుకొని దాదాపు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసే దశకు చేరింది. ఈ దశలో టోల్‌ప్లాజాల ఏర్పాటులో భాగంగా 20 కి.మీ వద్ద, చిల్లకల్లుకు దగ్గరలోగల గట్టుభీమవరం వద్ద టోల్‌ప్లాజా నిర్మాణాన్ని చేపట్టారు. జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కూడా, ఒకే సెక్షన్‌లోని ఒకే మార్గంలో కనీసం 60 కి.మీ దూరంలోపు టోల్‌ప్లాజాను నిర్మించరాదని నిబంధన ఉన్నప్పటికీ, కీసరవద్దగల స్వర్ణటోల్ ప్లాజానుండి 29 కి.మీ పరిధిలోనే గట్టుభీమవరం వద్ద టోల్‌ప్లాజాను నిర్మించడంపై ఆ ప్రాంత ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ స్థితిలో మొదటగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర) స్పందించి నందిగామ తహసీల్దార్‌కి జూన్ 30న మెమొరాండం ఇచ్చారు. జులై 7న చందర్లపాడు తహసీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నానిర్వహించారు. ఈ సమస్య తీవ్రతను గమనించి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పార్టీలన్నీ అఖిల పక్షంగా ఏర్పడి ఆగస్టు 3వ తేదీనుంచి గట్టుభీమవరం టోల్‌ప్లాజా వద్ద నిరవధిక రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు.

ఆగస్టు 8వతేదీన సిపిఐ (యం.యల్) జిల్లా కార్యదర్శి ముప్పాళ్ళ భార్గవశ్రీ శిబిరాన్ని ప్రారంభించి, ప్రజలపై మరిన్ని భారాలు వేసే విధంగా పాలకులు చేపట్టిన ప్రైవేటీకరణ విధానాలు ఉన్నాయనీ, జిఎంఆర్ లాంటి బడా కాంట్రాక్టర్ల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వ నిబంధనలను కూడా మార్చివేస్తున్నారనీ, ప్రజలపై భారాలు పెంచే టోల్ ప్లాజాను ఎత్తివేసే వరకు అఖిలపక్షకమిటీ పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిఎంఆర్ సంస్థ అధికారులు టోల్‌ప్లాజా పనులు ఆపివేస్తామని చెప్పి, తిరిగి ప్రారంభించటంపై అఖిలపక్షకమిటీ కన్వీనర్ సూర్యదేవర నాగేశ్వరరావు, ముప్పాళ్ళ భార్గవశ్రీ, ప్రభుదాస్, తదితరుల నాయకత్వంలో ఆందోళనకారులు, సమస్య తేలే వరకు పనులు ప్రారంభించటానికి వీలులేదని పనులు చేస్తున్న ప్రొక్లెయిన్‌లను తిప్పిపంపించారు. జీఎంఆర్ అధికారులు, పోలీసులను పిలిపించుకొని పనులు ప్రారంభించటానికి చేసిన ప్రయత్నాలను కూడా గట్టిగా ఎదుర్కోటంతో పనులను అప్పటికి ఆపివేశారు.

గట్టు భీమవరం టోల్‌ప్లాజాను నిరసిస్తూ నందిగామ నియోజక వర్గంలోని అఖిలపక్ష నాయకత్వాన ఆగస్టు 21న స్థానిక తాహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మెమోరాండం సమర్పించారు. ఈ ధర్నాలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, లారీయజమానుల సంఘనాయకులు తదితరులు పాల్గొని ఈ ఆందోళనను ఐక్యంగా తీసుకువెళ్తామన్నారు. అనంతరం గట్టుభీమవరం టోల్‌ప్లాజా వరకు అఖిల పక్షపార్టీల నాయకులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

### అఖిలపక్షకమిటీతో చర్చలు

టోల్‌ప్లాజా విషయమై జిల్లా కలెక్టర్‌కు అఖిలపక్ష కమిటీ మెమోరాండం సమర్పించిన తర్వాత, జిల్లా కలెక్టర్ ఆదేశంమేరకు, విజయవాడ సబ్‌కలెక్టర్ సమక్షంలో నేషనల్ హైవేస్ అధికారులు, జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు, అఖిలపక్షకమిటీ నాయకులతో జగ్గయ్యపేటలో చర్చలు జరుపుతామని అఖిలపక్షనాయకులకు తెలిపారు. టోల్‌ప్లాజా వద్దనే చర్చలు జరపాలని వారు కోరగా, తదనుగుణంగా సమ్మతించి, నిర్వహించిన ఆగస్టు 27వతేదీ నాటి సమావేశానికి సబ్‌కలెక్టర్, నేషనల్ హైవేస్ ప్రాజెక్టు అధికారులు, జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. అఖిలపక్షకమిటీ నుంచి సిపిఐ, సిపిఐ(ఎంఎల్), వైయస్ఆర్‌పార్టీ, టిడిపి, సిపియం నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మరియు కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, బాధిత ప్రజలు, మహిళలు మొత్తం 400మంది వరకు హాజరయ్యారు. అఖిలపక్షకమిటీ నాయకులు ఒకే ఎజెండాగా అక్కడి టోల్‌ప్లాజాను ఎత్తివేయాలని ముక్త కంఠంతో చెప్పారు. చివరగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి, త్వరలో కలెక్టర్ సమక్షంలో అఖిలపక్షకమిటీ నాయకులతో మరో సమావేశాన్ని, ఏర్పాటు చేస్తానని సబ్‌కలెక్టర్ హామీఇచ్చారు. ✡

## 'ఆగస్టు-9 స్ఫూర్తినందుకోవాలి-ఆగస్టు 15 విద్రోహాన్ని గుర్తెరగాలి'

**ఆగస్టు 9-15 తేదీలు :**

**నాటి** పరతంత్రాన్ని నేటికీ కొనసాగిస్తున్న పాలకుల, పాలకవర్గాల దళారీ విధానాలకు వ్యతిరేకంగా యువతరం నిలబడాలని; క్విట్‌ఇండియా, జాతీయోద్యమం నాటి తెగువ, సాహసం, త్యాగాల దారిలో సమాజాన్ని మేల్కొలిపి, ముందుకు నడిపించటంలో యువతరం క్రియాశీలక పాత్ర నిర్వహించాలని పిలుపునిస్తూ నవయువసమాఖ్య ఆధ్వర్యంలో ఆగస్టు 9 నుండి 15 వరకు పలు ప్రాంతాలలో యువకుల సమీకరణ, సభలు, సమావేశాలు జరిగాయి. యువకులమధ్య, ప్రజలమధ్య విస్తృత ప్రచారకృషి సాగింది.

**గుంటూరుజిల్లా-రేపల్లె ప్రాంతం, చెన్నుపల్లివారి పాలెం**లో ఆగస్టు 15వ తేదీన యువకులు, విద్యార్థులు, బాలలు, మహిళలతో సభ జరిగింది. సభకు ఎన్‌వైఎస్ నాయకులు కా॥రాజేశ్వరి అధ్యక్షత వహించగా ఒపిడిఆర్ జిల్లా కార్యదర్శి కా॥ వి. హనుమంతరావు ముఖ్యవక్తగా హాజరై ఉపన్యసించారు. భారత పాలకులు అధికారం చేపట్టి 65 సం॥లు పూర్తికావస్తున్నా, దేశం లక్షల కోట్ల రూ॥ల ఋణ ఊబిలో దిగజారిపోయిందనీ, సాంఘిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయనీ, లక్షల కోట్ల రూ॥ల కుంభకోణాలతో దేశాన్ని దోచుకుంటూ మరోవైపు సరళీకృత ఆర్థిక విధానాల అమలుతో దేశాన్ని విదేశీ బహుళజాతులకు, సామ్రాజ్యవాదులకు తాకట్టుపెట్టిన ఘనత మనదేశ పాలకులదేనంటూ, పాలకవర్గాలు సృష్టించిన జీవన సమస్యల వలయంనుండి ప్రజలు విముక్తం కావాలంటే పోరాటమొక్కటే మార్గమని, యువతరం జాతీయోద్యమం నాటి దీక్ష, దక్షతలను, సాహసాన్ని, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు అడుగెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకా పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి బి.నాగబసవయ్య, గ్రామపెద్దలు, కమ్యూనిస్టు నాయకులు నరసింహారావుగారు పాల్గొని సందేశాలిచ్చారు.

**గుంటూరు నగరం**లోని సుబ్బారెడ్డినగర్‌లో ఆగస్టు 14న జరిగిన యువజనుల సమావేశానికి ఎన్‌వైఎస్ నగర అధ్యక్షులు బలరాంరెడ్డి అధ్యక్షత వహించగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఉపన్యసించారు. వ్యవసాయరంగం, పాలకుల విధానాలు, మార్కెట్ దళారుల దోపిడీతో నాశనం అయిపోతుండగా యువతరం పనులకోసం గ్రామాలు వదలి పట్టణాలకు వలసలు వస్తున్నారన్నారు. పట్టణాలలో ఉపాధి సమస్య, పోటీ తీవ్రంగా ఉండటంతో పాటు వ్యసనాలు, జూదం వారిని పక్కదారి పట్టిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ కుట్రలను ఓడించి, యువత చైతన్యవంతులు కావాలని, పోరాటమార్గం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర కార్యదర్శి పి.మల్లి, సభ్యులు కె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరి పట్టణం**లో ఆగస్టు 9న లక్ష్మీనరసింహ స్వామి కాలనీలోనూ, ఆగస్టు 14న శ్రామికనగర్‌లలోనూ యువకులతో సమావేశాలు జరిగాయి. జిల్లా నాయకులు కా॥ వి. దుర్గాప్రసాద్, పట్టణ కమిటి సభ్యులు బాజి, బాలాజి, మల్లి తదితరులు పాల్గొని యువతరం సంఘటితంగా నిలబడాల్సిన అవసరాన్ని, నేటి పరిస్థితుల్లో మరో స్వతంత్ర పోరాటానికి సన్నద్ధం కావలసిన కర్తవ్యాన్ని వివరించారు.

**ప్రకాశంజిల్లా టంగుటూరు మండలం, పొందూరు** గ్రామంలో యువకులతో జరిగిన సమావేశానికి ఎన్‌వైఎస్ కార్యదర్శి కా॥ జి.వెంకట్రావు అధ్యక్షత వహించగా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ఎస్.లలితకుమారి ఉపన్యసించారు. సమాజాన్ని మేల్కొలపవలసిన, ముందుకు నడిపించవలసిన యువతరాన్ని పాలకులు నిరంతరం సంక్షేమ పథకాలకోసం వెంపర్లాడేవారిగా, జాబ్‌మేళాల చుట్టూ పరుగులు పెట్టేవారుగా మారుస్తున్నారన్నారు. అవినీతి, కుంభకోణాలు, అసమానతలను తేలికగా తీసుకునే మనస్తత్వాన్ని, అన్యాయాన్ని ఎదిరించలేని, నాకెందుకులే అనే మనస్తత్వాన్ని పాలకులు పనిగట్టుకొని పెంచుతున్నారని అన్నారు. ఈ పరిస్థితిపై యువత-అప్రమత్తంగా ఉండి నాటి వీరులైన, యువకులైన భగత్‌సింగ్, అల్లూరి, అష్ఫాఖుల్లాఖాన్‌లను ఆదర్శంగా తీసుకొని నిజమైన దేశభక్తితో నూతన సమాజస్థాపనకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు.

వేటపాలెంమండలం - **వందిళ్ళపల్లి**లో, **ఆనుమల్లిపేట**లలో యువకుల సమీకరణ, సమావేశాలు విస్తృతంగా జరిగాయి. ఉత్సాహంతో వినడం, చర్చించడం, తర్కించడం అనే పద్ధతిలో యువకులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ రాష్ట్రకమిటి సభ్యులు కా॥ ఎ. సతీష్ పాల్గొని మాట్లాడారు. ✡

# అందరికీ ఉచిత మందులు - ఎండమావే!

**'భారతప్రభుత్వ** ఔషధ విధానం - 2012'లో జాతీయ అత్యవసర మందుల జాబితా పరిధిలోనున్న అన్ని మందుల ధరలనూ అదుపుచేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాగా, భారతదేశ ఔషధ ధరల నియంత్రణ సంస్థ అయిన 'నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటి' (ఎన్‌పిపిఏ), 50 మందుల యొక్క ధరలను సవరించేందుకు (పెంచేందుకు) సిద్ధంగా వున్నామని ప్రకటించింది. మరోవైపున వీటి నడుమే భారత ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా మందులు అందజేస్తామనే విధానాన్ని ప్రకటించింది. ఔషధ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి వీలు కల్పించే మార్గదర్శక సూత్రాలకు ఇంకోవైపున మంత్రుల బృందం తుదిరూప మిస్తోంది. పరస్పర విరుద్ధమైన ఈ విధానాల లోతుపాతుల్లోకి వెళ్ళబోయేముందు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితినొక్కసారి పరిశీలిద్దాం.

ఔషధాలు, ఆహారంపై పరిశీలన జరుపుతున్న ప్రణాళికాసంఘ కార్యాచరణ కమిటి అందించిన వివరాల ప్రకారం, దేశంలోని 'ప్రజారోగ్య వ్యవస్థ' కేవలం 22 శాతం జనాభాకే సేవలందిస్తోంది. జబ్బులకు గురైన రోగులు- వారి ఆరోగ్య ఖర్చులలో 78 శాతం ఖర్చును వారే భరాయించుకుంటుండగా, దీనిలో 72 శాతం కేవలం మందుల కొనుగోళ్ళకే వెచ్చిస్తున్నారు! భారతదేశంలోని 30 శాతం గ్రామీణ జనాభా, 20 శాతం పట్టణ జనాభా అతి సాధారణ జబ్బులకు కూడా, కేవలం ఆర్థిక కారణాలరీత్యానే-వైద్యం అందని దుస్థితిలో వున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి చికిత్సకోసం ఆసుపత్రులలో చేరుతున్న వారిలో దాదాపు సగం మంది, అప్పులుచేసో, ఆస్తులు అమ్ముకొనో మాత్రమే చికిత్స పొందగలుగు తున్నారు. దీని ఫలితంగా, గ్రామీణ ప్రజల రుణభారాలకు, వైద్య చికిత్సల భారాలనేవి రెండో ప్రధాన కారణంగా ముందుకొచ్చింది. కేవలం జబ్బులను నయం చేయించు కోవటానికి అయిన ఖర్చుల కారణంగానే ప్రతి సంవత్సరం 3 కోట్ల 90 లక్షల జనాభా పేదరికంలోకి నెట్టివేయబడుతుండటం అనేది మరింత ఆందోళకరమైన అంశంగావుంది.

ఇంతటి నిరాశమయ వాతావరణ నేపథ్యంలో, గత నెలలో ప్రభుత్వం చేపట్టిన విధానపర నిర్ణయాలు ప్రజలకేమాత్రం మేలు కలిగించబోవనేది స్పష్టం. దాదాపు అన్ని దేశాలలో మందుల ధరలను అదుపుచేసే యంత్రాంగాలున్నాయి. భారత ప్రభుత్వం కూడా 1974లో 'ఔషధ ధరల నియంత్రణ వ్యవస్థ'ను ఏర్పరిచింది. 347 మందులు, ఔషధ ధరల అదుపు ఉత్తర్వు (డిపిసిఓ) క్రిందకు తీసుకురాబడ్డాయి. ఈ డిపిసిఓ నుండి తప్పుకునేందుకు ఔషధ పరిశ్రమలు నానా తప్పుడు పద్ధతులనుసరించాయి. అయినప్పటికీ, కొంతకాలం వరకూ అత్యవసర మందులు సామాన్య ప్రజలకు అందుబాటులోనే వుంటూవచ్చాయి. 1979 నుండీ, డీపీసీఓ మందులపై అదుపును పూర్తిగా తగ్గించివేసి, అధిక లాభదాయకమైన వాటిని అనుమతిస్తూవచ్చింది. 1984లో డీపీసీఓ పరిధిలోనున్న మందుల సంఖ్యను 142కు; 1995 నాటికి 74కు తగ్గించివేసింది. ఫలితంగా, అన్ని మందుల ధరలూ అత్యంత ఖరీదైనవిగా మారిపోయాయి. నూతన ఆర్థిక సంస్కరణల అమలు క్రమంలో డీపీసీఓ, తన పేరును ఎన్‌పిపిఏగా మార్చుకుని, తన పరిధిలో మిగిలివున్న 74 మందులలోని 50 మందుల ధరలను సవరించాలని (పెంచాలని) యోచిస్తున్నది. నెప్పులను అదుపు చేయటానికి విస్తృతంగా ఉపయోగించే ఇబూప్రూపెన్, తీవ్ర బాధా నివారిణిగా ఉపయోగించే పెడ్నిసోలోన్ మరియు టైపు-1, టైపు-2 మధుమేహ వ్యాధి చికిత్సలో ఉపయోగించే ఇన్‌సులిన్ వంటి మందులు ఈ సవరించే జాబితాలో వున్నాయి. షుగర్‌వ్యాధి చికిత్సకు ఉపయోగించే ఇన్‌సులిన్ మరియు తత్సంబంధ ఇతర ఔషధాల ధరలు పెరిగితే, అది డేనిష్ కంపెని నోవో నోర్డిస్క్, అమెరికా కంపెనీలు-ఎలిలిల్లి, సనోఫి, అవాంటిస్, వోక్‌హార్డ్ వంటి వాటికి లబ్ధిచేకూర్చుతుంది. భారతదేశంలో షుగర్ వ్యాధిగ్రస్తులు 6 కోట్ల మంది వరకూ వున్నారు, వీరి సంఖ్య ప్రతి సంవత్సరమూ పెరుగుతూ వస్తున్నది.

జపాన్ కంపెనీ డైచీ, రాన్‌బాక్సీని కొనివేసిన తర్వాత క్రమంలో, గత రెండు, మూడు సంవత్సరాల కాలంలో భారత ఔషధ పరిశ్రమలను బహుళజాతి పరిశ్రమలు వెల్లువలా ఆక్రమించుకుంటున్నాయి. ఇంకా అనేక పరిశ్రమలు ఆ వరుసలో వున్నాయి. అమెరికా కంపెనీ మిలాన్, మాట్రిక్స్ లాబ్స్‌ను కొనేసింది. మరో అమెరికా కంపెనీ అబాట్‌లాబ్స్ 2010లో ఒక భారత జనరిక్ ఔషధ తయారీ సంస్థను కొనుగోలు చేసింది. కాగా, ఈ సంస్థే నేడు దేశంలో అత్యధికంగా జెనరిక్ ఔషధాలను, బ్రాండెడ్ ఔషధాలను అమ్మకాలు సాగించేదిగావుంది. గ్లాక్సో స్మిత్ క్లెయిన్ రెండవ స్థానంలోవుంది. మిత్సుయ్ అండ్ కంపెనీ, ఆర్చ్ ఫార్మాలాబ్స్ అనే భారత సంస్థలో తన మదుపుకు అనుమతికోసం వేచివుంది. పి. ఫైజర్ అండ్ బి. బరున్ అనే సింగపూర్ సంస్థ ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్న వాటిల్లో మరొకటిగా వున్నది. 62 వేల కోట్ల రూపాయల భారత వైద్య విపణిపై విదేశీ సంస్థలు పైచేయి సాధిస్తాయని, తద్వారా వారి గుత్తాధిపత్యం నెలకొని ఔషధాల ధరలు మరింతగా పెరుగుతాయనీ, బహుళజాతి పరిశ్రమలపై ఆధారపడవలసివస్తుందనీ తీవ్రమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఈ విలువైన అభ్యంతరాలన్నింటినీ ప్రక్కనబెట్టి, వివిధ శాఖల మంత్రులతో కూడిన బృందం, ఔషధరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి మార్గాన్ని సుగమం చేస్తూ నియమావళిని సడలించింది. ఎఫ్ఐబిపి ఆమోదం పొందిన తర్వాత, బ్రౌన్‌ఫీల్డు మదుపుల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి వుండబోతోంది. బ్రౌన్‌ఫీల్డు మదుపు అంటే, ఉనికిలోవున్న ఒక కంపెనీలోని ఒక చిన్నవాటా లేదా భాగాన్ని సేకరించుకోవటం లేదా కొనుగోలు చేయటమని అర్థం. కావున, ఈ ప్రతిపాదిత మార్పు ద్వారా, బ్రౌన్‌ఫీల్డు మదుపుల రూపంలో విదేశీ బహుళజాతి ఔషధ పరిశ్రమ యొక్క 3వేల కోట్ల రూ॥ పైబడిన పెట్టుబడులకు మార్గం సుగమమౌతుంది. ఇక, బహుళజాతి ఔషధ పరిశ్రమలు గ్రీన్‌ఫీల్డు మదుపు రూపంలో 100 శాతం పెట్టుబడులు పెట్టేందుకు ఆటోమేటిక్‌గా మార్గమేర్పడుతుంది. దీనితో, వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఔషధ ఉత్పత్తి మరియు మార్కెటింగ్ పరిశ్రమ బహుళజాతి కంపెనీల ఆధిపత్యంలోకి అతిత్వరగా వెళ్ళిపోతుంది. మందుల తయారీ రంగంపై వారి ఆధిపత్యం సుస్థిరమవటంతో వారు ఇతర దేశాలకు అధికలాభాలకు మందులను ఎగుమతి చేయటంతోపాటు, వారి సూపర్‌లాభాల వేటలో భారత ప్రజానీకాన్ని తీవ్రమైన దోపిడీకి గురిచేయటం అధికమౌతుంది. దీనితో అత్యధిక భారత ప్రజానీకానికి అందుబాటులో లేనివిగా, కొనుగోలు సాధ్యంకానివిగా మందుల ధరలు పెరిగిపోతాయి.

భారత పాలకవర్గాలు, వారి రాజకీయ ప్రతినిధులు ప్రజలను వంచించటంలో ఆరితేరారు. అత్యవసరమైన వాటితో సహా మందుల ధరలన్నింటినీ పెంచే చర్యలు ఒక వైపున తీసుకొంటూనే, మరోవైపున ఉచితంగా ప్రజలందరికీ మందులనందిస్తామని వారు ప్రకటిస్తున్నారు.

2012 చివర నుండి అమలులోకి వచ్చే ఈ నూతన ఔషధ విధానం, రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాపితంగా చుట్టబెట్టనుండగా, 2017 ఏప్రిల్ నాటికి దేశంలోని 52 శాతం జనాభాకు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్నది. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్లు, జెనరిక్ మందులను మాత్రమే రోగులకు వ్రాసివ్వాలి తప్ప బ్రాండెడ్ మందులను వాడమని చెపితే, శిక్షార్హులౌతారు (ఈ సూత్రం ప్రైవేటు ఆసుపత్రులకు వర్తించదు) ప్రభుత్వం నేరుగా జెనరిక్ మందుల తయారీదారుల నుండే సేకరించి, తన ఆసుపత్రుల ద్వారా ఉచితంగా సరఫరా చేస్తుంది.

ప్రభుత్వ ఈ ప్రతిపాదనను రెండు విధాలుగా పరిశీలించవచ్చు. సానుకూలంగా చూస్తే, సూత్రరీత్యా, ఈ విధానం ప్రజాఆరోగ్య వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి, సుగమం చేస్తుంది. మరోవైపున చూస్తే ప్రజారోగ్య వ్యవస్థ తీవ్ర శిథిలావస్థలో నుండగా, ఈ పథకంయొక్క సమర్థతే పెద్ద ప్రశ్నార్థక మౌతుంది.

640 జిల్లాస్థాయి ఆసుపత్రులు, 28,000 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5000 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలతో కూడిన మన దేశంలోని అత్యధిక ప్రజారోగ్య యంత్రాంగం- సరిపడిన సిబ్బందిలేక, సరైన నిధులు లేక రోగగ్రస్థమై వుంది. ప్రస్తుత యంత్రాంగాన్ని సమర్థవంతంగా పనిచేయించటానికి 12 వేల కోట్ల రూ॥లు నిధులు ఈ రంగానికి అవసరమౌతాయి. ప్రజారోగ్య వ్యవస్థను అభివృద్ధి పరిచేందుకు అవసరమైన ఈ మేరకు నిధులను సమకూర్చేందుకే ప్రభుత్వం తన నిస్సహాయతను వ్యక్తం చేయగా (స్థూల జాతీయోత్పత్తిలో వైద్యరంగానికి ప్రభుత్వం కేటాయించిన 1.1 శాతం నిధులు-ప్రపంచ దేశాల కేటాయింపులలో చివరి నుండి 8వ స్థానంలో వుంది) ఉచిత మందుల పథకానికి 27వేల కోట్ల రూ॥ను ఖర్చుపెట్టటమనేది సాధ్యమా?

1995 నుండీ ఉచిత మందుల పథకం తమిళనాడు రాష్ట్రంలో అమలులోవుంది. గత సంవత్సరం రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోనూ జెనరిక్ మందుల చిల్లర విక్రయ దుకాణాలను తెరిచి, ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. తమిళనాడులో లీకేజీలు, రీసైకిలింగ్ వంటి అవినీతికర ఆచరణలతో ఈ పథకం భ్రష్టుపట్టిపోయి వుండగా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రారంభించిన ముందస్తు పథకాలు-నిర్లక్ష్యం, మందుల సరఫరా తగినంతలేకపోవటం వంటి సమస్యలతో పీకలలోతు కూరుకుపోయివున్నాయి. పేదల అవసరాలకు అందుకోవాలి, వారికి సేవచేయాలనే ఒక ధృఢనిశ్చయమే, మందులను అందరికీ అందుబాటులో వుండేవిధంగా వ్యవస్థను అభివృద్ధి పరుస్తుంది. సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారుల లాభాలదాహాన్ని తీర్చటానికి కంకణం కట్టుకున్న అధికారంలోనున్న పాలకులకు సరిగ్గా ఈ రాజకీయ దృష్టి, చిత్తశుద్ధే లోపించింది.

22 శాతం ప్రజానీకపు కనీస అవసరాలకు మాత్రమే తోడ్పడగలిగే ప్రజారోగ్య వ్యవస్థ - తగిన నిధులు సమకూర్చుకోని విస్తరించకుండా, సామర్థ్యాన్ని పెంచుకోకుండా, తన వైద్యసేవలను మెరుగు పరుచుకోలేదు. ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టకుండా, ఉచిత మందులు వంటి పథకాలు అమలుకాని వాగ్దానాలుగా మిగిలిపోయి, ప్రజల్ని వంచించటానికే తోడ్పడతాయి. ఈ పథకాలకు కేటాయించబడే నిధులలో అత్యధిక భాగం-జెనరిక్ మందుల భారీస్థాయి ఉత్పత్తి దారులైన బహుళజాతి పారిశ్రామికవేత్తలకు, అధికారంలోనున్న వివిధ దొంతరల దళారీ శ్రేణులకు చేరుతుందనేది నిస్సందేహం.

ఔషధరంగంలోని భారత పెట్టుబడిదారులు, తమ యాజమాన్య సాంకేతిక ప్రావీణ్యతలతో బహుళజాతి కంపెనీలతో పోటీపడగల తమసత్తా నిరూపించుకున్నారు. జనరిక్ మందుల ఉత్పత్తికే వారి ప్రయత్నాలు పరిమితమైనా, భారత ప్రజలకు అందుబాటులో వుండగలిగే చౌకధరలలో వాటిని ఉత్పత్తి చేయగలగటంలో వారు విజయం సాధించారు. ఇప్పుడు తమ ఆర్థిక బలంతో బహుళజాతి పరిశ్రమలు వీరిని నలుచుకు తినేందుకు పాలకులు అనుమతించారు. ఈ రోజు కాకుంటే రేపైనా మందుల తయారీ పరిశ్రమ మొత్తం- మందుల ధరలను అత్యధికంగా పెంచివేయటానికి నిర్ణయించుకోనివున్న-బహుళజాతి పరిశ్రమల చేతుల్లోకి వెళ్లటం ద్వారా సామ్రాజ్యవాదంపై మన పరాధీనత మరెన్నోరెట్లు అధికమౌతుంది.

11వ పంచ వర్షప్రణాళిక కాలం నాటి 'అందరికీ ఆరోగ్యం' అనే ప్రభుత్వ నినాదం అమలు కాని వాగ్దానంగా మిగిలిపోయింది. కాగా, అదే సమయంలో ప్రభుత్వం ప్రైవేటు ఆరోగ్య వ్యవస్థ పెరుగుదలను ప్రోత్సహించింది. మందుల తయారీరంగంలో బహుళజాతి కంపెనీల స్వేచ్ఛా ప్రవేశానికి అనుమతించటం రూపంలోనే గాక, బహుళజాతి సంస్థలు ప్రాయోజితం చేసిన ఆరోగ్య బీమా పథకాలను ప్రవేశపెడుతూ ఈనాడు 'అందరికీ ఉచితంగా మందులు' అనే ఆకట్టుకునే నినాదమిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులకు ఇంతకాలంగా అమలవుతూ వస్తున్న వైద్య ఖర్చుల తిరిగి చెల్లింపు స్థానంలో, దానికంటే ఎన్నో విధాల తక్కువ ప్రయోజనకరమైన ఆరోగ్యబీమా పథకం వుచ్చులోకి ప్రభుత్వం ఉద్యోగులను లాగుతుండగా, వారుకూడా దానికి గుర్తెరగకుండా దానిలో చిక్కుకుంటున్నారు. నిజమైన అర్థంలో భారత దేశీయ ఔషధ పరిశ్రమలకు బహుళజాతి పరిశ్రమల దురాక్రమణల నుండి రక్షణ కల్పించకుండా, ఔషధరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిపై నిషేధం విధించకుండా, భారతదేశంలోని అత్యధిక జనాభాకు అందుబాటులో, వారికి చేరువలో మందులను అందించగలగటమనేది 'ఎండమావి'గానే మిగిలిపోతుంది. ✡

---

**బీళ్ళుగా...** (5వ పేజీ తరువాయి)

మొదటివారం చివర్లో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో ముంపు కూడా ఏర్పడింది. కృష్ణా-డెల్టా ప్రాంతంలోనూ వర్షం బాగా కురిసింది ప్రకాశం బ్యారేజీ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువవటంతోపాటు వచ్చిన నీటినికుడి-ఎడమకాల్వలకు నిండుగానీరు వదిలారు. అప్పటికే నారు పూర్తిగా ఎదగటంతో రైతులు నాట్లు వేయటం ప్రారంభించారు. మరలా వానలు పడకపోవటంతో సాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. నీటిపారుదల అధికారులు కాల్వలకు నీరు విడుదల ఆపివేసిన ఫలితంగా కాల్వలు ఒట్టి పోయాయి. తిరిగి సేద్యానికి కష్టాలు మొదలయ్యాయి.

కాల్వలకు నీరు వదలక పోవటం వలన సేద్యం పూర్తి కాకపోవటంతోపాటు వేసిన నాట్లు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పైర్లను కాపాడు కొనేందుకు పిల్లకాల్వలలో ఉన్ననీటిని ఇంజన్లతోనూ, గూడలతో తోడి కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. పశ్చిమ డెల్టాలోని తెనాలి డివిజన్‌లోని కొల్లిపర, కొల్లూరు, వేమూరు, రేపల్లె, భట్టిప్రోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం,చందోలు, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల, పొన్నూరు మొదలగు మండలాల్లోని అత్యధిక భూముల్లో నాట్లుపడే పరిస్థితి కన్పించటం లేదు. తీరప్రాంత మండలాల్లో అసలు ఇంతవరకు నాట్లు పడలేదు. ఎంతో కష్టపడి పెంచిన నారుమళ్లు పనికిరాకుండాపోయే పరిస్థితి ఏర్పడింది. సేద్యం మీద ఉన్న ప్రేమతో ఏదో ఒక విధంగా నాట్లు వేయాలనే ఆతృతతో నీళ్ళ ఇంజన్లు 40 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. భూగర్భ జలాలను తోడి నాట్లు వేస్తున్నారు. వేసిన నాట్లకు నీరు అందించటం రైతాంగానికి తలకు మించిన భారంగా మారింది. నిత్యం పైర్లకు నీరు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడటంతో భూగర్భజలాలు పడిపోయి సాగునీటితోపాటు, త్రాగునీరు సమస్యగా మారింది. తెనాలి డివిజన్‌లో ఇప్పటివరకు అడపా దడపా కాల్వలకు వదలటం, రైతులు ఇంజన్లతో సాగు చేయటం వలన 40% మాత్రమే సేద్యం జరిగిందంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో ఊహించటం కష్టంకాదు. చక్కటి నీటిపారుదల సౌకర్యం ఉన్న తెనాలి డివిజన్‌లోనే ఈ పరిస్థితి ఉందంటే మిగతా ప్రాంతాల్లో ఎంత దారుణంగా ఉందో అర్థమౌతుంది. సేద్యం సజావుగా సాగక పోవటం వలన వ్యవసాయ కూలీలు కూడా వేరే ఉపాధిని వెతుక్కోవలసి వస్తున్నది.

చక్కటి పరిష్కారాలున్నా, వాటి అమలుకు పూనుకోకుండా ప్రభుత్వం దురుద్దేశ పూరితంగానే సాగునీటి కొరతను పెంచుతున్నది. తానే సమస్యను సృష్టించి, దానిని జటిలం చేసి, తాననుకున్న విధానాన్నే రైతాంగంతో ఆమోదింపచేసే లక్ష్యంతోనే ఇలా వ్యవహరిస్తున్నది. సాగు అవసరాలన్నింటి ధరలను పెంచివేసి, న్యాయమైన ధర యివ్వకుండా రైతాంగానికి సేద్యాన్ని భారంగా మార్చింది. ఈ నిజాన్ని దాచిపెట్టి వరిపంట లాభసాటిగా లేదు గనుక వాణిజ్య పంటలకూ, వాటికోసం కాంట్రాక్టు సేద్యానికి మళ్లమని చెబుతున్నది. దీనినమలుచేసేందుకే అనావృష్టి పరిస్థితిని కూడా వినియోగించుకుంటున్నది. ఈ విధానమంతా ప్రపంచబ్యాంకు రూపొందించి అమలు చేయిస్తున్నదే. భారత వ్యవసాయాన్ని సామ్రాజ్యవాదుల దోపిడీకి అనువుగా మలిచేందుకు సాగుతున్న కుట్రయిది.

కృష్ణా డెల్టా రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని, బ్యారేజీ నీటిని సేద్యానికేయివ్వాలని, రైతాంగానికందరికీ అదనంగా వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, ఎరువులు క్రిమిసంహారక మందులు సగం రేటుకే అందించాలని, వ్యవసాయ కూలీల కుటుంబాలకు 10 వేల ఉచిత సహాయం అందించాలని, రైతాంగం - వ్యవసాయకూలీలు సమైక్యంగా ఉద్యమించాలి. ✡







## ఇళ్లస్థలాల... (చివరి పేజీ నుండి)

దీనితో, ఐదువారాల అనంతరం జులై 4న ఈ స్థలంలో పూర్తిస్థాయిలో గుడిశెలు వేసుకొని, పేదలు అందులో కాపురాలు ఉండటం ప్రారంభించారు. నెలరోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తానన్న తన వాగ్దానాన్ని తుంగలో తొక్కిన తాశీల్దారు, పోలీసులచే దాడి చేయించినా, ఈసారి ప్రజలు తమ స్థానాన్నుండి వెనక్కు మరలలేదు. హైస్కూలు దగ్గర విద్యార్థులకు ఆటస్థలాన్ని, ఇక్కడే తమకు ఇళ్ళ స్థలాలను కేటాయించాలని కోరారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు.

### నిరుపేదలకు భూమి దక్కనీయకుండా కుటిల చర్యలు

204/2 సర్వే నెంబరులోని మూడున్నర ఎకరాలలో 50సెంట్లు ప్రభుత్వ భూమికాగా, మిగతా మూడు ఎకరాలను 1965లో 'హైస్కూలు ఆటస్థల అభివృద్ధి కమిటీ'కి దఖలు పరిచారు. ఈ "అభివృద్ధి కమిటీ"లోని 11 మందికిగానూ, 10మంది మరణించారు; గెడా వెంకట్రావు అనే భూస్వామి ఒక్కడే జీవించి వున్నాడు. ఆయన తమ పూర్వీకులు అమాయకంగా ఆటస్థల అభివృద్ధికమిటీకి ఈ భూమిని వ్రాసిఇచ్చారని, ఇప్పటిదాకా హైస్కూలు యాజమాన్యం ఈ ఆటస్థలాన్ని అభివృద్ధిచేయలేదనీ, దీనికి తన బాధ్యత ఏమీలేదనీ, ప్రస్తుతం ఈ భూమి నిరుపయోగంగా చెత్తచెదారంతో నిండి వున్నందున, తమ పూర్వీకులు రిజిస్టరు చేసిన దస్తావేజును రద్దు పరుస్తున్నట్లుగా 2007లోనే ఈ భూస్వామి గెడా వెంకట్రావు గుట్టుచప్పుడుకాకుండా రద్దు దస్తావేజు రూపొందించాడు. ప్రభుత్వాధికారులను లోబరుచుకుని, హడావుడి లేకుండా కొయ్యలగూడెం, నల్లజర్లలలోని కొందరికి 12సెంట్ల చొప్పున కొంతభూమి విక్రయించాడు కూడా!

తమకాలనీ ప్రక్కనే జరుగుతున్న ఈ కుట్రను గమనించిన నిరుపేద ప్రజానీకం, తమ నివాస స్థలాలకోసం ఈ భూములలోకి ప్రవేశించినంతనే, 'విద్యార్థుల ఆటస్థలాన్ని సంఘవ్యతిరేక శక్తులు ఆక్రమించుకుంటున్నాయ'ంటూ భూస్వామ్య, పెత్తందార్లు వారి తైనాతీలు గగ్గోలు పెట్టారు. కొన్ని విద్యార్థి సంఘాలు, వారివారి బ్యానర్లతో 'హైస్కూలు భూమిని కాపాడుకోవాలంటూ' నిరాహారదీక్షలకు దిగాయి. వాస్తవాలు గుర్తెరిగిన పిదప, ఆయా సంఘాల నాయకత్వాలు ఆ ఆందోళనలతో తమకు సంబంధం లేదని ప్రకటించాయి. దీనితో 'పూర్వవిద్యార్థులు' అనే బోర్డును భూస్వామ్య, పెత్తందార్లు ముందుకు తెచ్చి 'బూటకపు ఆందోళన'ను ఎగద్రోశారు. పూర్వ విద్యార్థులు కోర్టులో కేసులు వేశారని, తక్షణమే గుడిశెలను ఖాళీచేయాలని దినపత్రికలనిండా రాయించి, ప్రజల నైతిక ధృతిని దెబ్బతీసే ప్రయత్నం చేశారు. 'ఇళ్ళ స్థలాల సాధన కమిటి' ఆధ్వర్యంలో ప్రజలు ఈ ప్రచారాన్ని తిప్పికొట్టారు.

### చర్చల పేరిట మరో తతంగం-ప్రజలపై నిర్బంధం

గోపాలపురం తహసిల్‌దారు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓల సమక్షంలో అన్నిపక్షాలతో పలు థఫాలు చర్చలు జరిగాయి. 8-8-2012న గోపాలపురం తహశిల్‌దారు కార్యాలయంలో చర్చల అనంతరం ఒక ఒప్పందానికి వచ్చారు. భూస్వాములు పైన పేర్కొన్న 204/2 సర్వే నెంబరులోని స్థలాన్ని హైస్కూలు ఆటస్థలానికి వ్రాసేవిధంగానూ, అందులో తలదాచుకుంటున్న నిరుపేదలకు ప్రత్యామ్నాయ నివాసస్థలాలను ప్రభుత్వం కేటాయించేవిధంగానూ ఒప్పందంలో పేర్కొన్నారు. 'ఇళ్ళస్థలాల సాధనకమిటి' ప్రతినిధిగా రైతుకూలీసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ ఎం. ఎస్. నాగరాజు ఈ చర్చలలో పాల్గొన్నారు.

అయితే, పైన పేర్కొన్న ఒప్పందం ప్రకారం కూడా ప్రభుత్వం వ్యవహరించలేదు. ఒప్పందం జరిగిన మరునాడే 204/2 సర్వేనెంబరులో నివాసముంటున్న నిరుపేదలందరినీ తక్షణమే ఖాళీచేయించేందుకు ఐదుగురు యస్‌ఐలు; సి.ఐ.లు, 50మంది పోలీసులు తహసిల్‌దారు సమక్షంలోనే పేదలపై దాడికి తెగబడ్డారు. తాము ఒప్పందానికి కట్టుబడివుంటామనీ, అందులో పేర్కొన్న విధంగా తొలుత ఈ స్థలాన్ని హైస్కూలుకు దఖలు పరచాలనీ, తమకు ప్రత్యామ్నాయ ఇళ్ళస్థలాలు చూపాలనీ, అప్పటివరకూ ఈ భూమిని వదలి వెళ్ళబోమని 'ఇళ్ళస్థలాల సాధన కమిటి' సభ్యులు, ప్రజలు తెగేసి చెప్పారు.

ఒప్పందపు సిరా తడి ఆరకుండానే, దాని ఉల్లంఘనకు దిగిన ప్రభుత్వం - నిరుపేదల గుడిశెలను కూల్చివేసి, వారిని అక్కడినుండి తరిమివేసేందుకు పోలీసులను ప్రయోగించింది. తోపులాట- వాగ్వివాదాలు, అరెస్టులు - ప్రజల ప్రతిఘటనలు ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 4 గంటల దాకా కొనసాగాయి. నాయకులను వేరుచేసిన పోలీసులు, 13 మందిని అరెస్టుచేసి పోలీసుస్టేషనుకు తీసుకెళ్ళే ప్రయత్నాన్ని అడ్డుకోవటంతో, దొడ్డిదోవన జీపుల్లో తీసుకెళ్ళారు- అడ్డుకున్న ప్రజలపై లాఠీఛార్జికి పాల్పడ్డారు.

### నివాస స్థలాల సాధనకు నిశ్చయాత్మకంగా కదులుతున్న నిరుపేదలు

జోరున కురుస్తున్న వర్షంలో 200 మంది గుడిశెవాసులు తమపై ప్రభుత్వ, పోలీసు దమన కాండను నిరసిస్తూ గ్రామంలో ప్రదర్శన జరిపి, అరెస్టుచేసి గోపాలపురం పోలీసుస్టేషన్‌కు తరలించుకు వెళ్ళిన తమ నాయకులను వెంటనే విడింపిచుకునేందుకు ఆ వర్షంలోనే బయలుదేరివెళ్ళారు. అరెస్టయిన ప్రజానాయకుల్ని రెవిన్యూ, పోలీసు అధికారులు నానారకాలుగా బెదిరించారు. అసభ్య పదజాలంతో దూషించారు, అవమానించారు. అయినప్పటికీ ప్రజలు తమ డిమాండ్లనుండి వెనక్కు తగ్గబోరని వారు స్పష్టంచేశారు. అర్థరాత్రి 12 గంటల వరకు జోరున కురుస్తున్నవానలో ముసలివాళ్ళు, పిల్లలు తిండిలేకుండా తమ నాయకులను విడిపించు కెళ్ళేందుకు స్టేషను ఎదుటే బైఠాయించారు. ఇక 'లాభంలేదను'కున్న అధికారులు, అర్థరాత్రి ఒంటిగంటకు అరెస్టుచేసిన వారందరినీ విడుదల చేశారు. తమకు ఇళ్ళస్థలాలు కేటాయించేవరకూ పోరాడుతామని, సాధించుకొని తీరుతామని దళిత, గిరిజన, నిరుపేదలంతా ఆందోళనను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారు.

దొండపూడి దళిత పేద ప్రజానీకం సుదీర్ఘకాలం ఆ స్థలాన్ని పేదప్రజానీకం కోసం కాపలాగాశారు. దాన్ని కొందరు పెత్తందారులు రియల్‌ఎస్టేట్‌గా అమ్ముకోబోతున్నపుడు, ఆ భూమి ప్రజాప్రయోజనానికి తప్ప, వ్యక్తిగత స్వార్థాలకి ఉపయోగపడరాదని వారు పోరాడుతున్నారు. వీరి పోరాటం పెత్తందారుల కుట్రలను బట్టబయలుచేసింది. కోర్టు తీర్పుల పేరుతోనో, మరే పేరుతోనో పెత్తందారులు దళిత పేదప్రజలపై మరోసారి విరుచుకుపడేందుకు పథకాలు రూపొందిస్తున్నారు. ఇతర ప్రాంత ప్రజల, ప్రజాతంత్రవాదుల అండదండలతో పెత్తందారుల కుటిల పథకాలను, దాడులను తిప్పి కొట్టేందుకు గుడిశెవాసులు సదా సిద్ధంగా వుండాలని పరిస్థితులు హెచ్చరిస్తున్నాయి. ✡

## 'అక్రమ మైనింగ్, ప్రాజెక్టుల పేర గెంటివేతలకు వ్యతిరేకంగా భూమికోసం సాగుతున్న పోరాటాలను బలపర్చండి'



వరంగల్ జిల్లా సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ కోటయ్య; సదస్సుకు హాజరైన ప్రతినిధులు

**వరంగల్, 26-8-12 :**

**'భూమి, నీరు, ఖనిజ సంపదల అక్రమాలూ- నిర్వాసితులవుతున్న ప్రజలు, ప్రజాశక్తుల ముందున్న సవాళ్ళు-కర్తవ్యాలు' అనే అంశంపై రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్), అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య(న్యూ) వరంగల్ జిల్లాల** ఆధ్వర్యంలో హన్మకొండలోని ఆర్ట్స్ & సైన్స్ కాలేజి సెమినార్ హాల్‌లో కా॥ బొర్ర ఆనంద్, భైరబోయిన ఐలయ్యల అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య మాట్లాడుతూ, వరంగల్‌జిల్లాలో ఆదివాసీలు, లంబాడీలు, బంజారాలు, దళిత, పేద ప్రజానీకం, ఒకప్పుడు భూమికోసం పోరాడి సాధించుకున్నారనీ, అట్టి భూములను రక్షించుకొనుటకు పోరాడాల్సిన పరిస్థితి నేడు ఏర్పడిందని అన్నారు. వరంగల్ జిల్లాలో చిట్యాల, ములుగు, నల్లబెల్లి, కొత్తగూడ, గూడూర్, మహబూబాబాద్, భూపాలపల్లి, ఘన్‌పూర్ తదితర ప్రాంతాలలో చాలా విలువైన ఖనిజ సంపద బొగ్గు, ఇనుము, లేటరైట్, డోలామైట్, సున్నపురాయి, ఇసుక, గ్రానైట్ తదితర అనేక రకాల సంపద భూమిలో దాగివున్నది. ఆ భూములపై, గుట్టలపై కన్నేసిన దోపిడి శక్తులు ఆ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసీ, లంబాడ, గిరిజన, పేద ప్రజలను అనేక ప్రలోభాలు పెట్టటం, వినని వారిని బెదిరింపులకు గురిచేయటం, ఆ ప్రాంతాలను మైనింగ్‌కు కేంద్రాలుగా ఏర్పాటు చేసుకోవటం, అధికార యంత్రాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని ప్రజల భూములను తమపేర పట్టాలు చేయించుకొని ప్రజలను బలవంతంగా భూములనుండి ఖాళీ చేయిస్తూ, తప్పుడు కేసులు పెట్టిస్తూ, అధికార యంత్రాంగంతో బెదిరింపులకు గురిచేస్తూ ప్రజల జీవనాన్ని ధ్వంసం చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇది అన్యాయం అంటూ ప్రజలు తిరగబడితే, లాఠీలతో అణచివేయాలని చూస్తున్నారు. ఇలా ఈ ప్రాంతంలోని ఖనిజ సంపదను దోచుకుని బొందల గడ్డలుగా మారుస్తున్నారు.

అభివృద్ధి పేరుతో నర్సంపేట డివిజన్‌లోని నల్లబెల్లి మండలం గోవిందాపురం గ్రామం వద్ద వున్న రంగారాయ చెరువును రిజర్వాయర్‌గా మార్చి నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట మండలాలలో 32,500 ఎకరాలకు సాగునీరు అందిస్తామని 320 కోట్ల రూపాయలతో రిజర్వాయర్ నిర్మాణం చేయటానికి 5 గ్రామాలను ముంపుకు గురిచేస్తూ, 5 వేల మందిని నిరాశ్రయులను చేయటానికి పనులను ప్రారంభించటానికి కాంట్రాక్టర్లు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. నేటికీ అది ఏజెన్సీ ఏరియాగా ఉంది. అక్కడి ప్రజలు అడవిని నరికి పోడుచేసుకొని ఇప్పుడిప్పుడే భూములను సాగులోకి తెచ్చుకొని వాణిజ్య పంటలు పండించే స్థాయికి వచ్చారు. ఆ భూములను నమ్ముకుని బ్రతుకుతున్న 5వేల మందిని ఈ రిజర్వాయర్ మూలంగా నిర్వాసితులను చేయబోతున్నారు. నిజంగా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధిని ఆకాంక్షించే పాలకులే అయితే, వారికి చిత్తశుద్ధి వుంటే రైతుల భూములు ముంపుకు గురికాకుండా, గ్రామాలు మునగకుండా, లింక్ చెరువుగా రంగారాయచెరువును చేసి, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట మండలాలలోని చెరువులను గొలుసుకట్టుగా కలిపి చెరువులను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలి. అలా కాకుండా మైనింగ్ మాఫియాకు అండగావుండి వారి ఇనుపశుద్ధి కర్మాగారం కోసం ప్రజలను నిర్వాసితులను చేయాలనుకుంటే ప్రజలు తిరగబడి, తమ భూములను తాము రక్షించుకొనుటకు, ఏ త్యాగం చేయటానికైనా సిద్ధపడతారని, భూమిని, సహజవనరులను రక్షించుకొని భవిష్యత్ తరాలకు, దేశాభివృద్ధికి రైతు-కూలీసంఘం ఆధ్వర్యంలో జరిగే పోరాటాలలో ప్రజలందరు ముందుడా'లని పిలుపునిస్తూ కా॥ కోటయ్య ముగించారు.

మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి బాదావత్ రాజు మాట్లాడుతూ, అడవులు, కొండలు, కోనల్లో దొరికే సహజ సంపదపై కన్నేసిన బహుళజాతి సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు మన పాలకులతో కుమ్మక్కై దోచుకుపోతుండటాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు సంఘటితమై ఐక్యంగా నిలబడి జీవించే హక్కును కాపాడుకొనుటకు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఒపిడిఆర్ వరంగల్ జిల్లా కన్వీనర్ కా॥ బీరం రాము మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో, ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని, వేలకోట్ల రూపాయలను కొల్లగొట్టి కాంట్రాక్టర్లు పాలకులు తమ బొజ్జలు నింపుకుంటున్నారనీ, తప్పని స్థితిలో భూసేకరణ చేపట్టినా, భూమికి భూమి, ఇంటికి ఇల్లు తదితరాలు కల్పించిన తరువాతనే వాళ్లను ఖాళీచేయించాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం రాష్ట్రనాయకులు కా॥ భూతం వీరన్న మాట్లాడుతూ, రైతులు తాము ఆధారపడి జీవనాన్ని కొనసాగించిన భూమిని వదులుకోవటానికి సిద్ధంగాలేరనీ, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని స్వీకరించి మన ప్రజలంతా ఐక్యంగా నిలబడి మన భూములు మనకే దక్కాలని, మన సంపద పరాయిదేశాలకు పోకుండా మనకే చెందాలని రైతు- కూలీసంఘం ఆధ్వర్యంలో జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సదస్సునుద్దేశించి ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ మోడెం మల్లేష్, రైతు-కూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎండి యాకూబ్, ఎన్‌వైఎస్ జిల్లా కన్వీనర్ కా॥ ఈర్ల పైడి తదితరులు మాట్లాడారు. ఈ సదస్సులో అరుణోదయ నాయకులు కా॥ పాపన్న, ప్రసాద్, ఎల్లన్న తదితరులు పాడిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నారు. ✡

## నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఆందోళన

**మంగళగిరి, 6-8-12:**

భవన నిర్మాణరంగంలో అసంఘటిత కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఉపాధి భద్రత కల్పించాలని, ఇసుక మాఫియాను అరికట్టి, తక్కువ ధరకు ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ చైతన్య భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో కార్మికులు మంగళగిరి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, అనంతరం తాశీల్దారు కార్యాలయంవద్ద ధర్నా చేశారు.

ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్రకార్యవర్గ సభ్యులు, భవననిర్మాణ కార్మికసంఘ గౌరవాధ్యక్షులు కా॥ జగ్గారపు సుబ్బారావు మాట్లాడుతూ, ఇసుక, సిమెంట్, ఇనుము ధరలు పెరిగిపోతుండటంతో పనులు ఆగిపోతున్నాయనీ, ఈ కారణంగా కార్మికుల కుటుంబాలు గడవటం కష్టంగా మారుతున్నదనీ, కార్మికుల సంక్షేమం కోసమని ఏర్పరచిన సంక్షేమబోర్డు కార్మికులకు రావలసిన పరిహారాలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంవలన కార్మికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటు న్నారన్నారు. కార్మికులు సంక్షేమబోర్డుకు చెల్లించిన డబ్బును కార్మికుల శ్రేయస్సుకు వినియోగించడం మానివేసి ఇతర అవసరాలకు దారిమళ్ళించడం జరుగుతుందని, దీనిని తక్షణం నిరోధించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గమంతా సంఘటితంగా నిలబడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

సంఘ అధ్యక్షులు కాశిన కొండలరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ పథకాన్ని 50 సం॥ల వయస్సు వారి నుండి వర్తింపచేసి, నెలకు 1000/-లు చొప్పున చెల్లించాలని, స్వంత ఇళ్ళ నిర్మాణానికి, పనిముట్ల కొనుగోలుకు పావలావడ్డీకి ఋణాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం ఆర్‌డిఓ, తాసీల్దార్‌లకు, కార్మిక శాఖాధికారికి వినతి పత్రాలను ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎస్‌కె.ఇబ్రహీం, బూదాటి శ్రీనులతో సహా పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ✡

## రైతుల సొమ్ముతో... (4వ పేజీ తరువాయి)

బ్యాంకులు రైతాంగం ఎడల ఎంత కర్కశంగా వ్యవహరిస్తున్నాయో ఇది తెలియచేస్తున్నది.

రైతులకిచ్చిన పంట రుణాల నుండి ప్రీమియంను మినహాయించుకుని, మొత్తం రుణానికి వడ్డీని లెక్కగట్టి, రైతుల నుండి వసూలు చేసుకొంటున్న బ్యాంకులకు, రైతులకిచ్చే బీమా పరిహారాన్ని జమ చేసుకొనే హక్కు ఎక్కడిది? ఎవరైతే బీమా చేశారో వారికే బీమా పరిహారం అందించాల్సిఉండగా అందుకు విరుద్ధంగా బీమా కంపెనీలు బ్యాంకులకు జమ చేయటం నేరం కాదా?!

### బీమా సంస్థల వ్యాపారం

పంటల బీమా పథకం, బీమా కంపెనీలకు లాభసాటి వ్యాపారంగా మారింది. బీమా ప్రీమియం క్రింద రైతులు చెల్లిస్తున్న వందల కోట్ల రూపాయలను వివిధ రూపాల్లో అప్పులు యిచ్చి పెద్దఎత్తున వడ్డీ వసూలు చేసుకుంటూ లాభాలు గడిస్తున్నాయి. ప్రీమియం చెల్లించి ఎటువంటి పరిహారం పొందని రైతులకు తిరిగి ఆ ప్రీమియం కూడా చెల్లించకుండా తమవద్దనే ఉంచుకొంటున్నాయి. దీన్ని గమనించినప్పుడు పాలకులు ప్రవేశపెట్టిన పంటల బీమా పథకం రైతాంగాన్ని ఆదుకొనేందుకు కాకుండా, బీమా కంపెనీల వ్యాపారం కోసం ప్రవేశపెట్టిందనే వాస్తవం రుజువౌతుంది.

**రైతాంగం కోసమే పంటల బీమా పథకం ప్రవేశపెట్టామని చెబుతున్న పాలకుల మాటల్లోని మోసాన్ని అర్థంచేసుకోవాలి. బీమా ప్రీమియం సేద్యపు ఖర్చులకు కాకుండా మొత్తం పంట విలువకు వర్తింప చేయాలి. గ్రామ యూనిట్‌లోకి అన్ని పంటలను చేర్చి ఏ సంవత్సరరానికి ఆ సంవత్సరం ప్రాతిపదికగా తీసుకొని నష్టం జరిగిన మేర పరిహారం చెల్లించాలి. పరిహారం పొందని రైతులకు చెల్లించిన ప్రీమియం తిరిగి ఇవ్వాలి. వారు పేర్లు మార్పుచేసి పెంచిన ప్రీమియం రేటును తగ్గించాలి. ప్రభుత్వమే రైతులు చెల్లించే ప్రీమియంకు, రైతులకు యిచ్చే పరిహారానికి బాధ్యత వహించాలి. పైడిమాండ్ల సాధనకోసం రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలి.** ✡

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# ఇళ్లస్థలాల సాధనకై కొనసాగుతున్న దొండపూడి ప్రాంత నిరుపేద, దళిత, ఆదివాసీ, ప్రజాఆందోళన

**పశ్చిమగోదావరి జిల్లా –** గోపాలపురం మండలం, దొండపూడిగ్రామం ఏజన్సీని ఆనుకొని వున్న ప్రాంతం. ఈ గ్రామంలో అత్యధికులు– రైతుకూలీలు, రోజుకూలీలైన నిరుపేదలే. వీరిలో ఎక్కువమంది సమీప అడవిపై ఆధారపడి జీవనం సాగించేవారే. గ్రామ జనాభాలోని సగభాగమైన దళితులతోసహా నిరుపేద ప్రజానీకమంతా నికృష్ట జీవితం గడుపుతున్నవారే.

### మూడుదశాబ్దాలనాడు–204/1 సర్వేనెంబరులో ఇళ్ళ ఏర్పాటు

1986 సం॥లో సంభవించిన గోదావరి వరదలకు అత్యంత నిరుపేదలైన ఈ ఆదివాసీ, దళిత ప్రజానీకం కాల్వలగట్లపై వేసుకున్న గుడిశెలు సైతం కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలారు. వీరంతా తమకు తలదాచుకోను ఇళ్ళస్థలాలను కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తులు చేసినా 'చెవిటి వానిముందు శంఖమూదిన' చందమైంది. ఈ క్రమంలో తమ గ్రామంలోనేవున్న 204/1 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిలో ఈ నిరుపేదలంతా నివాసాలను ఏర్పరచుకున్నారు. భూస్వాముల దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిర్బంధాలకు గురయ్యారు. గుడిశెవాసులపై సంఘ కార్యకర్తలనేక మందిపై కేసులు పెట్టబడి, జైళ్ళకు వెళ్ళారు. ఏమైనా, పట్టు వదలకుండా ప్రజలు సాగించిన ఈ సంఘర్షణతో దిగివచ్చిన ప్రభుత్వం, పేదలు గుడిశెలు వేసుకున్న స్థలాలను చట్టబద్ధంగా వారికి కేటాయించింది. తదనంతర కాలంలోనూ గుడిశెవాసులు, పక్కాఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వంపై ఆందోళనల ద్వారా వత్తిడితెచ్చి వాటిని సాధించుకో గలిగారు.

### దొండపూడి ప్రాంత ప్రజల ప్రస్తుత ఆందోళన

గత మూడు దశాబ్దాల కాలంలోనూ, కుటుంబ జనాభా పెరిగింది; పిల్లలు పెరిగి, పెద్దవారై పెళ్ళిళ్ళు కూడా అయ్యాయి. రెక్కాడితేగానీ డొక్కాడని ఈ నిరుపేదలు, నిత్యజీవన సమరం సాగించే ఈ నిరుపేదలు – పెళ్ళిళ్ళయిన తమ బిడ్డలకు మరో గూడును చూపించలేకున్నారు. ఒక్కో ఇంటిలో 3, 4 కుటుంబాలు ఇరుక్కొని, కాపురాలు సాగించే దుర్భర పరిస్థితుల నడుమ, అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ళస్థలాలు కేటాయించాలనే డిమాండ్ ప్రారంభమైంది. రెవిన్యూ సదస్సులు, గ్రామసభలు, రచ్చ బండలువంటి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగానూ, సామూహికంగా ప్రభుత్వాధికారుల వద్దకు ప్రజలంతా వెళ్ళటం ద్వారా – అనేక సందర్భాలలో ఇళ్ళస్థలాలకు విజ్ఞప్తులు చేస్తూవచ్చారు. గత రెండు సం॥లుగా ఏజన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం (ఆం.ప్ర)ల సహకారంతో దొండపూడి, రాజుంపాలెం గ్రామాల దళిత, ఆదివాసీ, ఇతర కులాల నిరుపేద ప్రజానీకమంతా సంఘటితమై 'దొండపూడి దళిత, గిరిజన, పేదల ఇళ్ళస్థలాల సాధన కమిటి' ఏర్పరచుకొని వివిధ రూపాల్లో విజ్ఞప్తులు చేస్తూ ఆందోళన సాగిస్తున్నారు.

### సర్వే నెంబరు 204/2 భూమికై ఆందోళన

1986లో తాము నిర్మించుకున్న కాలనీకి ఆనుకునే వున్న 204/2 సర్వేనెంబరులో మూడున్నర ఎకరాల భూమి ఖాళీగా వుంది. ఆ భూమి, అక్కడికి 2 కి॥మీ॥ దూరంలోని హైస్కూలుకు చెందిన ఆటస్థలమని చెప్పబడుతూ వుంది. అయితే ఏనాడూ ఆ భూమిని శుభ్రం చేయటంగానీ, ఆటస్థలానికి అనువుగా మలచటంగానీ, హైస్కూలు విద్యార్థులు అక్కడకువచ్చి ఆడుకోవటంగానీ జరగలేదు.

ఇన్నాళ్ళూ 'ఆటస్థలం' అని చెపుతూవచ్చిన ఆ భూమిని, భూస్వాములు ప్లాట్లుగావేసి విక్రయానికి పెట్టారని ప్రజలకు రూఢీగా తెలియటం, కొంతభూమి అమ్మివేయబడటంతో, తమ కాలనీని ఆనుకొనివున్న స్థలాన్ని తమకే ఇళ్ళస్థలాలుగా కేటాయించాలనీ; అవసరమైతే యస్.సి., యస్.టి. కార్పోరేషన్లద్వారా కొనుగోలు చేయించి అయినా తమకు కేటాయించాలని–'ఇళ్ళస్థలాల సాధనకమిటి' ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా విజ్ఞప్తిచేస్తున్నా అర్హులైనవారికి ఇళ్ళస్థలాలు కేటాయించకపోవటంపై ఆనాటి జిల్లాకలెక్టరు ఆశ్చర్యాన్ని, ఆవేదనను ప్రకటించి, వెంటనే నిరుపేదలందరికీ ఇళ్ళస్థలాల కేటాయింపుకు చర్యలు చేపడ్తానని ప్రకటించాడు. కానీ యధావిధిగా ఈ వాగ్దానమూ గాలిలో కలిసిపోయింది తప్ప, ప్రజలకు భూమి దక్కలేదు. ప్రభుత్వాధికారులపై వత్తిడితేవటంతో పాటు, తమ నికృష్ట జీవన పరిస్థితులను వివరిస్తూ, 204/2 సర్వే నెంబరుస్థలం ఆటస్థలం కాదని ప్రజలకు తెలియజెప్తూ కరపత్రాల ద్వారా 'ఇళ్ళస్థలాల సాధన కమిటి' విస్తృత ప్రచారం నిర్వహించింది.

### సర్వే నెంబరు 204/2 భూమిలో గుడిశెల ఏర్పాటు

204/2 సర్వే నెంబరులోని భూమిని అమ్ముకోవటానికి భూస్వాములకు తోడ్పడుతున్న ప్రభుత్వం, తమకు ఇళ్ళస్థలాలకు ఇక కేటాయించదని తేల్చుకున్న పేదప్రజానీకం, 'ఇళ్ళస్థలాల సాధన కమిటి' ఆధ్వర్యంలో 2012 మే 28న ఆ స్థలాన్ని ఆక్రమించుకొని గుడిశెలు వేసుకున్నారు. భూస్వాములు ప్లాట్లువేసి, అమ్మకానికి పెట్టినా మిన్నకున్న ప్రభుత్వం, నిరుపేదలు ఆభూమిలోకి దిగీ దిగటంతోనే పోలీసు, రెవిన్యూ అధికారులను ప్రజలపైకి దాడికి పంపింది. పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నిర్వహణకోసం వచ్చిన బి.ఎస్.ఎఫ్.బలగాలను సైతం మోహరించి, ప్రజలను భీతావహుల్ని చేయటానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజలు బెదిరిపోకుండా, రెవిన్యూ అధికారుల వాదనలలోని బూటకత్వాన్ని, భూస్వామ్య అనుకూల స్వభావాన్ని వెల్లడిచేశారు. 'తమకు ఒక్క నెల రోజుల సమయమివ్వాలని, ప్రజల నివాసస్థలాల సమస్యను పరిష్కరిస్తామ'నే తహసిల్దారు హామీతో ప్రజలు ఒకనెల రోజులపాటు తమ ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ హామీ కూడా కుటిలపూరితమైనదేనని తేలటానికి ఎక్కువ సమయమేమీ పట్టలేదు. **(తరువాయి 7వ పేజీలో)**

# 'లక్షింపేట దళితులకు భూమిదక్కేవరకూ పోరాటం సాగించాలి'

## లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి 'చలోఢిల్లీ' కార్యక్రమంలో వక్తల పిలుపు


'చలో ఢిల్లీ' ధర్నాలో ప్రసంగిస్తున్న బొజ్జా తారకం,


సుబోధ్ మిత్రా,


పి.కె. షాహి,


ఎస్. ఝాన్సి


'చలో వరంగల్' సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్. ఝాన్సి

**న్యూఢిల్లీ, 6–9–12 :**

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' పిలుపు మేరకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి– అనేక ప్రయాణ ఇబ్బందులనెదుర్కోని– వందలాది మంది ప్రజానీకం, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సెప్టెంబరు 6వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ కూడలికి చేరుకున్నారు.

లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి కన్వీనర్ బొజ్జా తారకం అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ధర్నా మధ్యాహ్నం 3 గంటల వరకూ కొనసాగింది. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి, ఎఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్ మిత్రా, ఎఐఎఫ్‌టియు(న్యూ) ఢిల్లీనాయకులు కా॥పి.కె. షాహి, స్త్రీవిముక్తి సంఘటన (ఆం.ప్ర.) రాష్ట్ర నాయకులు కా॥ అమలేందు; కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, దళిత స్త్రీశక్తి నాయకులు గెడ్డం ఝాన్సీ, ఆర్‌పిఐ రాష్ట్ర కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్‌లతోపాటుగా జెఎన్‌యూ, ఢిల్లీకి చెందిన పలువురు అధ్యాపకులు, 'పోరాట సంఘీభావ కమిటి' సభ్య సంఘాల ప్రతినిధులు ధర్నాలో పాల్గొని సంఘీభావంగా ప్రసంగించారు.

లక్షింపేట దళితులపై దాడుల ఘటనకు కారకులైన కులదురహంకార పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లక్షింపేట బాధితులకు తక్షణ సహాయ చర్యలతోపాటు, 250 ఎకరాల భూమిని వారికి కేటాయించాలని, లక్షింపేటలోనే న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి సత్వర విచారణ పూర్తి చేయాలని ఈ సందర్భంగా పలువురు వక్తలు డిమాండ్ చేశారు.

ఏఐకెఎంకెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్‌మిత్రా మాట్లాడుతూ దేశవ్యాపితంగా, అనునిత్యం దళితులపై, మైనారిటీ మతస్థులపై, అల్పసంఖ్యాక జాతులపై, మహిళలపై, వెనుకబడిన కులాల పేద ప్రజానీకంపై–భూస్వామ్య, అగ్రకుల దురహంకారుల దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ సాగుతున్నాయని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో నెలకొన్న ఫ్యూడల్ సంబంధాలను బద్దలు కొట్టకుండా, 'దున్నేవానికే భూమి' నినాదంగా భూమిసమస్య పరిష్కారం గాకుండా, ఈ దాడులను అంతమొందించలేమనీ, ఈ దిశగా పోరాటాలను ఎక్కుపెట్టవలసిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

ధర్నా అనంతరం వివిధ ప్రజాసంఘాల బాధ్యులతో కూడిన 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ప్రతినిధి బృందం కేంద్రహోంశాఖా మంత్రి సుశీల్‌కుమార్ షిండేను కలసి లక్షింపేట దళితులపై దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించటంతోపాటు, వారికి భూమిపై చట్టబద్ధహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

## 'చలో వరంగల్'

**వరంగల్, 2–9–12 :**

లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి జులై 21న 'చలో తిరుపతి'; జులై 28న 'చలో విశాఖ'; ఆగస్టు 6న 'చలో విజయవాడ' పిలుపుల అనంతరం సెప్టెంబరు 2న 'చలో వరంగల్' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ పిలుపుమేరకు హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో 'కులనిర్మూలనా పోరాట సమితి' రాష్ట్ర నాయకులు అభినవ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పలుతెలంగాణా జిల్లాల నుండి దళిత, పీడిత ప్రజానీకం, వివిధ ప్రజా, దళిత, కుల నిర్మూలన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' కన్వీనర్ బొజ్జా తారకం, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ఝాన్సి, ఏఐఎఫ్‌టియు (న్యూ) వరంగల్ జిల్లా నాయకులు మోడెం మల్లేశం, స్త్రీ విముక్తి సంఘటన (ఆం.ప్ర.) నాయకులు అమలేందు, కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, తెలంగాణా ప్రజాఫ్రంట్ నాయకులు చిక్కుడు ప్రభాకర్, అంబేద్కర్ సంఘ నాయకులు బొమ్మాల కట్టయ్య, కాకతీయ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకట నారాయణ, ప్రొ॥ బద్రూనాయక్ తదితరులు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

వక్తలు తమ ప్రసంగాల్లో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఈ నాటికీ కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనం, వివిధ రూపాల్లో వేధింపులు, అగ్రకుల దురహంకారదాడులు, దౌర్జన్యాలు, సాంఘిక బహిష్కరణలు, మూఢనమ్మకాల ముసుగులో దళితులపై కక్షసాధిపులు మరియు పలురూపాల్లో సాగుతున్న అణచివేత చర్యలకు వ్యతిరేకంగా దళిత, ప్రజాసంఘాలు కలిసి కట్టుగా ఐక్య ఉద్యమాలు నిర్మించటం ద్వారానే దళిత ప్రజానీకంలో నైతిక స్థైర్యాన్ని పోరాట స్ఫూర్తిని పెంపొందించ గలుగుతామని పేర్కొన్నారు.

లక్షింపేట దళితుల భూమిసమస్యను తక్షణం పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. ✡

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*